


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA RISING CURE - PURE - RARE

సంపుటి : 18 సంచిక : 384 | 31-03-2026 మంగళవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు.

వివరాలు 2లో..



## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు.



## బంగారం ధరల్లో ఒడిదుడుకులు

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్స్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది.

వార్త 2లో



## ఆహార కల్తీ నియంత్రణ
# సరికొత్త వ్యవస్థ

వార్త 2లో

- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు.**

సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు.





## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి

గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వార్త 2లో

## ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !



## రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన
## మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్

2లో..

- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ

వార్త 2లో



సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు.

## న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు

అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకొస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభలో వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో న్యాయవాదులు వామనరావు దంపతులు హత్యకు గురైన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. పట్టపగలే వారిని హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ప్రోద్భలంతోనే వారు హత్యకు గురైనట్లు ఆక్షేపించారు. అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ బిల్లు తీసుకొస్తున్నట్లు చెప్పారు.

## సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాల్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్..సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చుచేశామని చెప్పారు. ఇపుడు పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు.

# ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మ్యూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

# బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

### బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా

పాట్నా, అక్షరకలం ప్రతినిధి

: బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు. ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

### స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్లు ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ధమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్లు వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

### వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి

### గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

### సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ

హైదరాబాద్,

జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కవిత లేఖలో గుర్తు చేశారు. జీవో 317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేసి.. ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని కవిత లేఖలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారని లేఖలో గుర్తు చేశారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీవో నం.317 తీసుకు వచ్చారు. . 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. జీవో నం.317 బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ సబ్ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత తెలిపారు.

# ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

### ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన

### నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు

### సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది

### వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం

### త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ

### 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర

### దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ

### దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి

### కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది

### మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం..



పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

## కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

### ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి

### వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ

### అండగా ఉంటామని హామీ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి





సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

# రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన

### మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్

### ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

### శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి

హైదరాబాద్,

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఒక్క రోజు సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరిస్తున్నట్లుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అవినీతి, అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది. అసెంబ్లీ సెషన్ ముగిసేవరకూ సమావేశాలకు హాజరుకాకుండా బహిష్కరించింది. దీంతో పొంగులేటి కంపెనీ అవినీతిపై మండలిలో బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. పొంగులేటిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అవినీతిపై సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా మండలి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇలా మండలి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, సస్పెన్షన్‌కు నిరసగా బీఆర్ఎస్ మండలి సభ్యులు చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో మండలి సభ్యులను మార్షల్స్ బలవంతంగా లాక్కెళ్లారు. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాని.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. చైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభలో సీఎం రేవంత్ స్పష్టం చేశారని చెప్పారు. సభ సజావుగా సాగేందుకు బీఆర్ఎస్ సభ్యులు సహకరించాలని కోరారు. మరోవైపు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని పదే పదే కోరారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన కొనసాగించడంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఒకరోజుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ఇప్పటికే అసెంబ్లీలో కూడా బిఆర్ఎస్ సభ్యులను ఆదివారం సస్పెండ్ చేశారు. సోమవరంతో అసెంబ్లీ సమావేశాలు ముగియనున్నాయి.

## ఘణంగా మాజి ఎంపీపీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి జన్మదిన వేడుకలు



అక్షర కలం బీబీనగర్

బీబీనగర్ మండల మాజీ ఎంపిపి ఽ మాజీ జడ్పీటీసీ మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు , పేదల పెన్నిది ,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గోలి ప్రణీత పింగల్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలో ఘణంగా జరిగాయి. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ పుట్టినరోజు వేడుకల్లో మాజీ ఎంపిటీసీ గోలి నరేందర్ రెడ్డి , కాసుల ఆంజనేయలు గౌడ్, ఉపసర్పంచు గోలి నరసింహ రెడ్డి మాజీ జడ్పీటీసీ సంధిగారి బసవయ్య ,ఆగమయ్య గౌడ్ , మండల కోఅప్షన్ సభ్యులు ఎండీ అక్బరు, నారగొని మహేశ్ గౌడ్ , వార్డు సభ్యులు ఆకుల రాజ్యలక్ష్మి రవిందర్ , కాసుల వరలక్ష్మి మహేష్ గౌడ్ , రొడ్డ యమున , కట్ట వినోద్ , సోమ శివ కుమార్ , నెల్లుట్ల శ్రీశైలం , పిట్టల శ్యామల శ్రీనివాస్ ,బుర్రి సుదర్శన్ రొడ్డ శ్రీను , పింగల్ అన్న సేవాదళ్ గౌరవ అద్యక్షులు కాసుల రఘునందన్ గౌడ్, అద్యక్షులు ఎండీ .మెయిన్ , తుమ్మల నరసింహ రెడ్డి , తంగళ్ల పల్లి రవి , దేవరుప్పల శ్రీదర్ ,బొర్ర వెంకట రెడ్డి , అస్లం , రాంచందర్ , రాగేర్ శ్యామ్ , గొలనుకొండ శేఖర్ , ఉప్పలంచి శ్రీకంత్ , పంజాల సందీప్ , పంజాల వేణు గౌడ్ , కాసుల అజయ్ కుమార్ , ఎండీ.మస్తాన్ ,కాసుల సాయి గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు .

# మెనూ అమలులో విఫలం.!

## విద్యార్థినులపై వేధింపులు.!!

### బీసీ గురుకుల పాఠశాల ముందు ఎస్ఎఫ్ఐ భారీ ధర్నా

### పేద విద్యార్థుల రక్తాన్ని తాగుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ డిమాండ్

అక్షరకలం మిర్యాలగూడ

బిసి గురుకులాల అధికారులు పేద విద్యార్థినుల పక్షమా లేక అవినీతి అధికారుల పక్షమా అని భారత విద్యార్థి ఫెడరేషన్ నిలదీసింది. మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్‌లోని దామరచర్ల బిసి బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ, ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ




సభ్యులు ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థినులకు కనీస నాణ్యమైన భోజనం అందడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తుంగలో తొక్కి విద్యార్థినుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 రోజులుగా విద్యార్థినులకు కనీసం గుడ్డు, పండు, స్నాక్స్, చికెన్ లేదా మటన్ వంటివి అందించడం లేదు. రెండోసారి అన్నం అడిగిన విద్యార్థినులను బడ్జెట్ లాస్ అవుతోందంటూ ఇష్టానుసారంగా తిట్టడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు.

### అమానవీయ ఘటన...

పాఠశాలలో జరుగుతున్న అమానవీయ చర్యలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. అందరూ భోజనం చేశాక మిగిలిన అన్నం తిన్నారనే నెపంతో 8వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులను రాత్రి 8 గంటల సమయంలో మోకాళ్ళపై నిలబెట్టి వేధించారని శంకర్ ఆరోపించారు. క్రమశిక్షణ పేరుతో విద్యార్థినులను శారీరకంగా, మానసిక హింసకు గురిచేస్తున్న డ్యూటీ టీచర్, ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి. ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, పాఠశాలలో జరుగుతున్న నిధుల దుర్వినియోగం, మెనూ ఉల్లంఘనలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్, వెంటనే స్పందించి, పేద విద్యార్థులకు కడుపునిండా భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోని పక్షంలో, జిల్లా వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మూడవత్ జగన్ నాయక్, కుర్ర సైదా నాయక్, నాయకులు ప్రసన్న, సూర్య, బన్ని, సుబాని, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 30:



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణ కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 6 చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ ఉన్నాయని, జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని, అనాధ పిల్లలను గుర్తించి వారిని తగిన వసతి గృహాలలో చేర్పించాలని తెలిపారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించి వారికి తగిన పారితోషకం ఇప్పించాలని, 14 సంవత్సరాల లోపు బాల బాలికలను పాఠశాలలలో చేర్పించాలని, ఇటుక బట్టీల దగ్గర ఉండే పిల్లలకు పని దగ్గర ప్రదేశాలలో పాఠశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనాధ పిల్లలు, డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆయా వసతి గృహాలలో చేర్పించాలని, చైల్డ్ హెల్ప్ లైన్ కు అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి , అదనపు గిరిజన సంక్షేమ శాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం: కారు ఢీకొని యువకుడు మృతి





అక్షరకలం దేవరకొండ

కొండమల్లేపల్లి శివార్లలో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితుడు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒక కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు యువకుడు గాలిలోకి ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అధిక రక్తస్రావం కావడంతో అతను స్పాట్‌లోనే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారైనట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. కారు నంబర్ ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణను వేగవంతం చేశారు.

# పాలనలో పారదర్శకతకు "ఈ - ఆఫీస్" బాట

### ఏప్రిల్ 1 నుండి అమలు

### ఫైళ్ల నిర్వహణకు ఇక గుడ్ బై..

### ఆన్‌లైన్‌లోనే అంతా

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం



ఫైళ్ల నిర్వహణలో పారదర్శకత, వేగవంతానికై ఏప్రిల్ 1 నుండి ఈ – ఆఫీసు ఫైల్ పద్ధతిని అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సంబంధించి ఈ – ఆఫీస్ ఫైల్ నిర్వహణను ప్రారంభించారు. ఫైళ్ల నిర్వహణలో పారదర్శకతతో పాటు, కచ్చితత్వం, వేగవంతం చాలా అవసరమని, ఈ – ఆఫీసు ద్వారా వీటిని సాధించవచ్చని, పరిపాలనలో ఈ –ఆఫీస్ ఫైలింగ్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. దీనితోపాటు, ఫైళ్ళ నిర్వహణలో జాప్యాన్ని తగ్గించవచ్చని, ఫైళ్లు కనిపించకుండా పోవడం వంటివి జరగడానికి అవకాశం లేదని అన్నారు. మాన్యువల్ ఫైళ్ళ నిర్వహణలో పేపర్ ,ఫైల్ బోర్డులు,ట్యాగులు ఉపయోగించాల్సి వస్తుందని, ఈ – ఆఫీస్ ఫైలింగ్ లో ఇవన్నీ అవసరం లేదని తెలిపారు. ఈ ఆఫీసు వల్ల ఫైళ్లను భౌతికంగా అధికారి వద్దకు తీసుకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆన్లైన్లోనే అనుమతి తీసుకోవచ్చన్నారు. ఈ – ఆఫీస్ ఫైలు నిర్వహించడం ఎంతో సులువు అని, అధికారులతో పాటు, సెక్షన్ ను సహాయకుల వరకు ఇది బాగా ఉపయోగపడుతుందని చెప్పారు.ఫైల్ నిర్వహణలో కూడా సులభంగా ఉంటుందని, మ్యానువల్ ఫైళ్లను దాచి ఉంచేందుకు బీరువాలతోపాటు, రికార్డు గదుల వంటివి అవసరమని, అయితే ఈ – ఆఫీసులో బాధ ఉండదని, రికార్డుల నిర్వహణ సులువుగా ఉంటుందని, ఫైళ్లను రికార్డు రూమ్ లో కాకుండా ఆన్లైన్ లోనే ఫైళ్లన్నింటిని భద్రంగా ఉంచుకోవచ్చని, ఏళ్ల తరబడి ఉన్న సమాచారాన్ని కూడా ఆన్లైన్లో సులభంగా తెలుసుకునేందుకు ఈ –ఆఫీస్ విధానం చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ– ఆఫీసు ఫైల్ విధానం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, అందువల్ల వెంటనే ఈ–ఆఫీసు ఫైళ్లను ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. ఈ విధానంపై ఇప్పటివరకు శిక్షణ పొందని ఉద్యోగులు తక్షణమే శిక్షణ పొందాలని చెప్పారు. కోర్టు కేసులు, ఇతర ముఖ్యమైన మాన్యువల్ ఫైళ్లు తప్ప తక్కిన అన్ని ఫైళ్లు ఈ– ఆఫీస్ విధానంలో నిర్వహించాల్సిందిగా ఆయన ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్డీఓ రమణా రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, ఈ – జిల్లా మేనేజర్ దుర్గారావు, ఎన్ఐసి ఫ్రేమ్, కలెక్టర్ కార్యాలయ సూపరింటిండెంట్లు, సహాయకులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## పేదలకు వరం సీఎం సహాయ నిధి పథకం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

అక్షర కలం బీబీనగర్



యాదాద్రి భువనగిరి జిల్లా బీభీనగర్ మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన రామాచారి అత్యవసర శస్త్ర చికిత్స నిమిత్తమై 2,50,000=00 (రెండు లక్షల యాభై వేల రూపాయలు) సీఎం సహాయ నిధిని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సోమవారం అందించారు. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్ ) పేదల పాలిట వరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం బాల్ రెడ్డి , గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ గూడూరు నిఖిల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ భువనగిరి జిల్లా అసెంబ్లీ అధ్యక్షులు బద్దం వాసుదేవ రెడ్డి, రామాచారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు...

## బీబీనగర్ వాసికి ఉగాది స్వర్ణ నంది పురస్కారం

అక్షర కలం బీబీనగర్



యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త బుర్రి బాలచందర్ కు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కళానిలయం కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన వేడుకల్లో 'ఉగాది స్వర్ణ నంది' పురస్కారంతో సత్కరించారు. సామాజిక సేవారంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమంలో కళానిలయం ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయనను అభినందించారు.

## కాలేజీకి రాకుండా వివాదం సృష్టించిన విద్యార్థిని... పోలీస్ స్టేషన్ వరకు వ్యవహారం

### – 28% అటెండెన్స్...

### కాలేజీపై ఆరోపణల దుమారం –

### – విద్యార్థిని, కుటుంబం హంగామా...!!

ఉప్పల్, మార్చి 30(అక్షర కలం):

ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజీలో చదువుకుంటున్న త్రినైని విద్యార్థిని వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. 2023లో డిగ్రీలో చేరిన ఈ విద్యార్థిని మొదటి సంవత్సరంలో చదువు, హాజరులో మెరుగైన ప్రదర్శన చూపించినప్పటికీ, రెండో సంవత్సరం నుంచి పూర్తిగా మారిపోయినట్లు కాలేజీ వర్గాలు చెబుతున్నాయి. కాలేజీ నిబంధనల ప్రకారం కనీసం 70 శాతం అటెండెన్స్ తప్పనిసరి కాగా, ఈ విద్యార్థిని అటెండెన్స్ కేవలం 28 శాతంగా నమోదైందని వెల్లడించారు. పలుమార్లు ప్రిన్సిపాల్ మిస్ జయంతి రెడ్డి, ఉపాధ్యాయులు మంజుషా, ధ్వని సంప్రదించినా, ప్రతి సారి ఆరోగ్య సమస్యలే కారణమని చెప్పి తప్పించుకుంటూ వచ్చినట్లు సమాచారం. గత ఏడాది మెడికల్ సర్టిఫికేట్ ఆధారంగా యాజమాన్యం సడలింపు ఇచ్చినా, ఈ సంవత్సరం కూడా అదే కారణం చూపుతూ కాలేజీకి దూరంగా ఉండటం, పైగా యాజమాన్యం, ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పరిస్థితిని మరింత విషమం చేసింది. ఇదిలా ఉండగా, విద్యార్థిని త్రినైని, ఆమె తల్లి దీప్తి కాలేజీ ముందు ధర్నాకు దిగడం, కుటుంబ సభ్యులు, కొంతమంది రాజకీయ వ్యక్తులను తీసుకువచ్చి హంగామా సృష్టించడం కలకలం రేపింది. కాలేజీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రచారం చేయడం యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురిచేసింది. పలుమార్లు చర్చలు జరిపినా, వారు వెనక్కి తగ్గకపోవడం ఉద్రిక్తతను మరింత పెంచింది. చివరకు ఈ వివాదం పోలీస్ స్టేషన్ వరకు చేరింది. ముందుగా విద్యార్థిని కాలేజీ యాజమాన్యంపై ఫిర్యాదు చేయగా, ప్రతిగా యాజమాన్యం కూడా పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై స్పందించిన ప్రిన్సిపాల్ మిస్ జయంతి రెడ్డి, మెంబర్ జోసెఫ్ బ్రాడ్, లీగల్ అడ్వైజర్ రామకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడుతూ---విద్యార్థిని అటెండెన్స్ రికార్డులు, ఆడియోలు, వీడియోలు సహా అన్ని ఆధారాలను బయటపెట్టారు. పలుమార్లు అవకాశాలు ఇచ్చినా స్పందించకపోవడంతో, ఇక చట్టపరంగా ముందుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా, విద్యార్థిని కాలేజీకి ఎందుకు రాకపోతున్నారని ప్రశ్నించగా, తాను సూసైడ్ చేసుకుంటానని బెదిరింపులకు దిగుతున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. ఇదే సమయంలో, సోమవారం జరిగిన పరీక్షకు కూడా ఆ విద్యార్థినిని హాజరు కావడానికి కాలేజీ యాజమాన్యం అవకాశం కల్పించినట్లు తెలిపారు. వివాదం కొనసాగుతున్నప్పటికీ, విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్ష రాయడానికి సహకరించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన ప్రస్తుతం ఉప్పల్ ప్రాంతంలో హాట్ టాపిక్‌గా మారింది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

## నక్సలిజాన్ని అంతం చేస్తే..

# విప్లవ భావన మరణిస్తుందా?

**నక్సలిజం ముగిస్తే.. విప్లవ భావన కూడా సమాధి అవుతుందా? లేక అది మరింత లోతుల్లోకి వెళ్లి మరో రూపంలో మళ్లీ పుట్టుకొస్తుందా? ఒక వర్గానికి ఇది శోషితుల స్వరంగా, అణగారిన వర్గాల ఆశగా కనిపిస్తే.. మరొక వర్గానికి రక్తపాతం, హింసగా అనిపిస్తుంది. దశాబ్దాలుగా దేశాన్ని వేధిస్తున్న ఈ సమస్యకు మార్చి 31, 2026 లోపు నక్సల్-ముక్త భారత్ అనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా లక్ష్యం నిజంగా ముగింపు రేఖనా? లేక ఒక దశ ముగిసిన సంకేతమా? ఈ ప్రశ్నలకు సమాధానం కేవలం తుపాకుల శబ్దాల్లో కాదు.. సమాజం గుండెల్లో దాగి ఉన్న అసమానతల్లో ఉంది. 1967లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని నక్సల్బరి గ్రామంలో మొదలైన ఈ తిరుగుబాటు ఉద్యమం భూమి, హక్కులు, విముక్తి అనే నినాదాలతో అణగారిన వర్గాలను ఒక్కటి చేసింది. భూస్వామ్య వ్యవస్థపై రైతులు, కూలీలు పిడికిలి బిగించారు.**

కొన్ని స్థానిక విజయాలు సాధించారు. కానీ కాలం మారినా, వారి పోరాట విధానం మారలేదు. మార్పుకు అనుగుణంగా తమ శైలిని మార్చుకోలేకపోయారు. ఎన్నో ఉద్యమాలు కాలక్రమేణా కనుమరుగయ్యాయి. కానీ విప్లవం? అది ప్రజల గుండెల్లోని అశాంతి, అన్యాయంపై తిరగబడే ఉక్కు పిడికిలి. అది ఎప్పటికీ పూర్తిగా చనిపోదు. ాశ్రీంశీ =ఘు - ఇది యుద్ధాల యుగం కారాదు నక్సలిజం కేవలం తుపాకులు, గెరిల్లా యుద్ధం మాత్రమే కాదు. ఇది ఒక భావజాలం అణచివేత, శోషణకు వ్యతిరేకంగా పుట్టిన ఆకాంక్ష. ప్రభుత్వాలు దళాలను ఎన్‌కౌంటర్లు, ఆపరేషన్ల ద్వారా తుడిచిపెట్టవచ్చు. కానీ భావజాలాన్ని బుల్లెట్లతో చంపలేవు. అది ప్రజల మనసుల్లో, చర్చల్లో, సాహిత్యంలో, ఉద్యమాల్లో జీవించి ఉంటుంది. 2025 మేలో అబూజ్‌మడ్‌లో మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు (బసవరాజు) 27 మంది సహచరులతో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. 2025 అక్టోబర్‌లో మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అబయ్, తక్కల్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న బృందం 208 మంది దళ సభ్యులతో భారీగా లొంగిపోయారు. ఫిబ్రవరి 2026లో దేవుజి అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, బడే చొక్కారావు వంటి టాప్ నాయకులు సరెండర్ అయ్యారు. మార్చి 24న పాపారావు 17మంది జట్టుతో లొంగిపోయారు. చత్తీస్‌గఢ్‌లో గత రెండేళ్లలో వేలాది సరెండర్లు, అబూజ్‌మడ్‌లో భద్రతా దళాల ఆధిపత్యం. కానీ భగత్ సింగ్, అంబేద్కర్ భావజాలాలు ఎలా ఇప్పటికీ జీవించి ఉన్నాయో, నక్సలిజం భావజాలం కూడా అసమానతలు, అన్యాయాలు ఉన్నంతవరకు మరో రూపంలో కొనసాగుతుంది. హింసను అణచడం తాత్కాలికం. అసమానతలను తొలగించడమే శాశ్వత మార్గం. ప్రభుత్వం మార్చి



31, 2026 లోపు పూర్తి నిర్మూలన లక్ష్యంతో లా అండ్ ఆర్డర్ విధానాన్ని కఠినంగా అమలు చేస్తోంది. గత నాలుగు నెలల్లో సుక్మా, బీజాపూర్, నారాయణపూర్‌లో ఎన్‌కౌంటర్లు, సరెండర్లు పెరిగాయి. అబూజ్‌మడ్‌లో ఒకప్పటి రెడ్ కారిడార్ ఇప్పుడు భద్రతా దళాల చేతుల్లోకి వచ్చింది. మావోయిస్టు నాయకత్వం దాదాపు కుప్పకూలింది. కానీ ఇది నిజమైన శాంతి కాదు కదా? చర్చలు, మానవ హక్కులు, అభివృద్ధి మార్గాలు విస్మరించబడ్డాయని మేధావులు, పౌర హక్కుల సంఘాలు వాదిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఉంది. అన్యాయాలపై స్పందించే బాధ్యత ప్రభుత్వానిది. తుపాకీ మాత్రమే కాకుండా, ప్రజల గుండెల్లో మార్పు తీసుకురాగల అభివృద్ధి, న్యాయం అందించడమే నిజమైన శాంతి మార్గం. కేంద్ర ప్రభుత్వం నక్సలిజాన్ని దేశ అంతర్గత భద్రతా సమస్యగా చూసి, పోలీసు- సైనిక చర్యలతో ఎదుర్కొంటోంది. గత నాలుగు నెలల్లో ఈ వ్యూహం ఫలితాలు ఇస్తోంది. లీడర్‌షిప్ దెబ్బతిన్నది, సరెండర్లు పెరిగాయి. కానీ జస్టిస్ జీవన్ రెడ్డి కమిషన్ (2008) చెప్పినట్లు, చర్చలే స్థిరమైన పరిష్కారం. హింసకు హింసతో స్పందించడం తాత్కాలిక విజయం మాత్రమే. సమస్య మూలం భూమి సమస్యలు, ఆదివాసీల హక్కుల దోపిడీ, అట్టడుగు వర్గాల వెనుకబాటుతనం - పరిష్కరించకపోతే, తిరుగుబాటు మరో రూపంలో బయటపడుతుంది. నక్సలిజం పుట్టుకకు కారణం దళితులపై అత్యాచారాలు, గిరిజనుల భూముల దోపిడీ, పేదలకు అవకాశాల లోపం. ఇవి ఇప్పటికీ పూర్తిగా తొలగలేదు. బలప్రయోగంతో ఒక రూపాన్ని అణచవచ్చు. కానీ అన్యాయం బతికి ఉంటే, ఆ భావన మళ్లీ మరో రూపంలో వస్తుంది. న్యాయం లేని సమాజంలో శాంతి కేవలం భ్రమ మాత్రమే. మరిన్ని కనుగొనండి ఆన్‌లైన్ ఈ-పేపర్ కెరీర్ వార్తలు ప్రాంతీయ వార్తలు ాశ్రీంశీ =ఘు - అల్లకల్లోలంలో సముద్ర వాణిజ్యం ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు అని చెబుతున్న ప్రభుత్వమే హింసాత్మక చర్యలు చేపట్టడం ఏమిటి? అణగారిన వర్గాల బాధలు, దోపిడీ, దమనం సహించలేక నక్సల్స్ ఉద్యమించారు. ప్రభుత్వం వారి హక్కులు, న్యాయం, అభివృద్ధి అందిస్తే నక్సలిజం ఎందుకు పుట్టాలి? ప్రజాస్వామ్యం అంటే చర్చ, సమన్వయం, పరిష్కారం. హింస అది ఎవరి నుంచైనా వచ్చినా - సమస్యను పెంచుతుంది తప్ప తగ్గించదు. మార్చి 31, 2026 తర్వాత ప్రభుత్వం విజయాన్ని ప్రకటించవచ్చు. గణాంకాలు మెరుగయ్యాయని చెప్పవచ్చు. కానీ నిజమైన ప్రశ్న అక్కడితో ముగియదు. తుపాకుల శబ్దం ఆగిపోవచ్చు.. కానీ అన్యాయం ఆగిపోయిందా? అసమానతలు చెరిగిపోయాయా? అణగారినవారికి న్యాయం అందిందా? ఇవే అసలు పరీక్షలు. విప్లవం అంటే కేవలం గన్ కాదు.. అది అన్యాయం చూసిన ప్రతి హృదయంలో మెదిలే ఆగ్రహం. ఆ ఆగ్రహానికి సమాధానం న్యాయం అయితేనే శాంతి శాశ్వతం అవుతుంది. లేకపోతే.. చరిత్ర మళ్లీ తనను తాను రిపీట్ చేసుకునే రోజు దూరంలో ఉండదు. - కాలగిరి శ్రీనివాస్‌రెడ్డి ఇప్పుడు సాగుతున్న యుద్ధాలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది.

## మంచిర్యాలలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల నిరసన

**మంచిర్యాల, మార్చి 30 అక్షర కలం:**

న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కోల్ పెన్షనర్లు చేపట్టిన ధర్నాకు మద్దతుగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా అంబేద్కర్ విగ్రహం ఆవరణలో జరిగిన ఈ నిరసనలో వృద్ధ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1998లో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మార్కెట్ ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంపుదల చేయాల్సి ఉన్నప్పటికీ, గత 28 సంవత్సరాలుగా పెన్షన్ పెంపు జరగకపోవడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. కరువు భత్యంతో కలిపి కనీసం 50 శాతం పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్‌గా రూ.15,000 చెల్లించాలని కోరారు. అలాగే సిపిఎంఆర్ఎస్ హెల్త్ కార్డు పరిధిని రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని, 2017 జనవరి నుంచి అమల్లోకి వచ్చిన రూ.20 లక్షల గ్రాచ్యుటీ సీలింగ్‌ను విశ్రాంత ఉద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. గోల్డెన్ హ్యాండ్‌షేక్ తీసుకున్న ఉద్యోగులు ప్రస్తుతం రూ.350 నుంచి రూ.1000 మధ్య మాత్రమే పెన్షన్ పొందుతున్నారని, ఇది అసమానతకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే, తక్కువ పెన్షన్ పొందుతున్న వారికి ఆసరా పెన్షన్ కల్పించాలి, ఇల్లు లేని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలి, అర్హులకు తెల్ల రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణిలో కొత్త అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులను ప్రారంభించడంతో పాటు, మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేసి, ఏరియా ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ సేవలను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి ప్రాంతాల నుంచి వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వైద్య ఖర్చులు, జీవన వ్యయం కారణంగా ప్రస్తుతం అందుతున్న పెన్షన్ సరిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవప్రదమైన జీవితం గడపడం కష్టమవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ఉపాధ్యక్షుడు పానగంటి పోషం, సలహాదారు మహేందర్ రాజు, మందమర్రి ఏరియా నాయకులు రామ్ రావేందర్, ఆడెపు రాజేశం, రేణికుంట కొమురయ్య, బి రాజన్న, తదితరులతో పాటు పలువురు నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.






## కొండపల్లి గణేష్ ఆధ్వర్యంలో నడుస్తున్న నాలుగు బ్రాండ్ షాప్ దుకాణాలకు తాళం వేసిన పార్ట్నర్స్.

**కోటి 30 లక్షలకు లెక్కలు చెప్పని వైనం.**

**అడిగితే దిక్కున్న కాడ చెప్పుకోమని బెదిరించిన కొండపల్లి గణేష్.**

**కొండపల్లి గణేష్ పై ఇల్లందు సీఐకి ఫిర్యాదు చేసిన బాధితులు.**

**అక్షర కలం / ఇల్లెందు**



ఇల్లందు పట్టణానికి చెందిన కొండపల్లి గణేష్ 14 మంది దగ్గర 70 లక్షలు, మరో 12 మంది దగ్గర 60 లక్షలు తీసుకొని బ్రాందీ షాపు వేలంలో పాల్గొని ఇల్లందులో నాలుగు షాపులను దక్కించుకున్నాడు. మరో షాపు కొన్నానని తెలుపుతూ వారి దగ్గర మరికొంత డబ్బు తీసుకొని ఐదు షాపులను ఇల్లందులో మెయింటైన్ చేస్తున్నాడని నాలుగు నెలల నుండి షాపులను మెయింటైన్ చేస్తూ మూడున్నర కోట్ల పైచిలుకు అమ్మకాలు జరిగినప్పటికీ ఒక రూపాయి కూడా తమకు ఇవ్వకుండా లెక్కలు చెప్పకుండా దాటవేస్తున్నాడని అడిగితే దిక్కున్న కాడ చెప్పుకోమని బెదిరించుచున్నాడని వారు వాపోయారు. ఈ సంఘటనకు సంబంధించి బ్రాండ్ షాపు పార్ట్నర్స్ అయిన బానోతు గోపీచంద్, స్రవంతి శ్రీనివాస్, బబ్బూరి శ్రీనివాస్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుల తరఫున వారు మాట్లాడారు. కొండపల్లి గణేష్ తమ దగ్గర కోటి 30 లక్షలు తీసుకొని బ్రాండ్ షాపు ల ద్వారా మూడు నాలుగు ఇంతలు లాభం వస్తుందని పేర్కొని గత నాలుగు నెలలుగా అందుబాటులోకి రాకుండా మోసం చేస్తున్నాడని, దిక్కున్న కాడ చెప్పుకోమని బెదిరించుచున్నాడని వారు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయామని, అనంతరం సోమవారం కొండపల్లి గణేష్ పై ఇల్లందు పట్టణ సీఐ కి లేఖతో కూడిన ఫిర్యాదు చేశామని బ్రాందీ షాపు బాధితులు తెలిపారు. అనంతరం విలేకరుల సమక్షంలో కొత్త బస్టాండ్ దగ్గర గల ఆరో షాప్ నెంబరు బ్రాందీ షాపుకు తాళం వేశారు. మిగితా షాపులకు సైతం తాళం వేసినట్లు వారు పేర్కొన్నారు. బ్రాండ్ షాపు వేలంలో వచ్చిన నాలుగు షాపులకు సంబంధించి అందులో ఒక షాపు తమ 14 మంది పార్ట్నర్స్ లో ఒకరైన సబిత పేరు పై ఇల్లందు లో షాపు వచ్చిందని వారు తెలిపారు. కొండపల్లి గణేష్ చేస్తున్న మోసంపై తీసుకున్న డబ్బులకు సంబంధించి తమకు న్యాయం చేయవలసిందిగా పోలీసు వారిని స్థానిక ఎమ్మెల్యేను వారు కోరారు.

## కలెక్టరేట్ వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా

**గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి...**

**ఖమ్మంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలి....**

**గిరిజన సంఘం నేత భూక్యా వీరభద్రం డిమాండ్**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గిరిజన సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం కొంతమంది గిరిజన సంఘం కార్యకర్తలు కలెక్టరేట్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం, తగిన స్థాయిలో నిధులు కేటాయించి అభివృద్ధి కి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఖమ్మంలో ఐటీడీఏ (ఃఖణాా)ను వెంటనే ఏర్పాటు చేయాలని, ఖమ్మం మరియు వైరా కేంద్రాలలో అసంపూర్తిగా ఉన్న గిరిజన భవనాల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలని కోరారు. అలాగే జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, ఉపాధి సమస్యలు, విద్యా సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని ఆయన తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదువుతున్న గిరిజన విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన నిరుద్యోగులు మరియు విద్యార్థుల కోసం ఖమ్మంలో ప్రత్యేక ఎంప్లాయ్మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. బోనకల్ మండలం రాయినూతల గ్రామంలో గత 50 సంవత్సరాలుగా సాగు చేస్తున్న అసైన్ భూములకు గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు బానోత్ కిషన్ నాయక్ మద్దతు తెలిపారు. అనంతరం, గిరిజన సంఘం బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ స్పందించి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోతు బాలాజీ, భూక్యా కృష్ణ నాయక్, గుగులోత్ పంతు నాయక్, బాధావత్ శ్రీనివాస్, భూక్యా నాగేశ్వరావు, భూక్యా కృష్ణ, భూక్యా లక్ష్మానాయక్, బానోతు హరిచంద్, ధరావతు నరసింహారావు, గుగులోత్ నరేష్ నాయక్, బానోతు నాయక్ ,శివ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హుల తొలగింపు

**బలవంత వసూళ్లపై విచారణ చేయాలి**

**అక్షర కలం/ కారేపల్లి:**




కారేపల్లి: ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులను తొలగింపు కు గురి అవుతున్నారని, ఇందిరమ్మ జాబితాలో లోని లబ్ధిదారుల నుండి వసూళ్ల పర్వ నడుసుందని దీనిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంః) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి సోమవారం ప్రజావాణిలో సింగరేణి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లుకు సీపీఐ(ఎం) బృందం వినతిప్రతం అందించింది. ఈసందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర లు మాట్లాడుతూ గ్రామసభలలో గుర్తించిన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాలో రాజకీయంగా, అర్థిక లావాదేవిల పరంగా కొందరు ప్రజాప్రతినిధులు సవరణలు చేస్తున్నారన్నారు. ఇది సహించేది లేదని హెచ్చరించారు. ఇండ్ల మంజూరుకు రూ.30వేల నుండి రూ.50వేల వరకు కొందరు ప్రజాప్రతినిధులు బేరాలు సాగిస్తున్నారన్నారు. ఇలాంటి వసూళ్లతో గత ప్రభుత్వ అబాసుపాలై , ప్రజల అగ్రహానికి గురైందని గుర్తుచేశారు. నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఎల్1లో ఇండ్లు నిర్మంచుకున్న వారికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుండి రూ.60వేల బిల్లులను వెంటనే మంజూరు చేయాలనికోరారు. ఇందిరమ్మ ఇండ్ల కు అక్రమ వసూళ్లు, అర్హులను జాబితాలో తొలగింపుపై అధికారులు విచారించి న్యాయం చేయాలని లేకుండా బాధితులను సమీకరించి అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**--- సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పిలుపు**

**అక్షరకలం కోదాడ**




గ్రామాల్లోని పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రవరం గ్రామపంచాయతీ సర్పంచ్ రావుల భవాని వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రవరం గ్రామంలో హైదరాబాద్ శంకర కంటి వైద్యశాల జీఎం బాలరాజు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్, నిర్వాహకులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఎర్రవరం, చుట్టుపక్కల ప్రాంతాల నుండి సుమారు 80 మంది ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు లేదా ఇతర ఆపరేషన్లు అవసరమైన వారిని నిర్వాహకులే ఆసుపత్రికి తీసుకెళ్లి, శస్త్రచికిత్స అనంతరం తిరిగి సురక్షితంగా గ్రామానికి చేరుస్తారని సర్పంచ్ వివరించారు. ఎర్రవరం గ్రామంలో శంకర కంటి వైద్యశాల వారు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని సర్పంచ్ రావుల భవాని వెంకటేశ్వర్లుఅన్నారు. మన తెలంగాణ రూరల్ రిపోర్టర్ నాయిని మల్లయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు అపాన్ అన్సారి, బాషిబోయిన భాస్కర్, వైస్ సర్పంచ్ షేక్ షాలిబ్బి మస్తాన్,?ముఖ్య నాయకులు వేమూరి మధు, నలజాల రామారావు, వీరేపల్లి నాగేంద్ర ప్రసాద్, నలజాల శ్రీనివాస్, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# కొన్ని రికార్డులు బద్దలు కొట్టడం అసాధ్యమే!

**2008లో ప్రారంభమైన ఈ లీగ్ ప్రతి సీజన్‌లోనూ ఒక కొత్త మైలురాయిని చేరుకుంటోంది. ప్రతి సీజన్‌లో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. లీగ్‌లో నమోదైన కొన్ని రికార్డులు ఎన్నేళ్లు గడిచినా చెక్కుచెదరకుండా ఉన్నాయి. 2026లో కూడా అవి అలాగే ఉండే అవకాశం ఉంది. ఇందులో విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ మధ్య నమోదైన భారీ భాగస్వామ్యం , ఒకే ఓవర్‌లో 37 పరుగులు సహా పలు రికార్డులు ఉన్నాయి. ఐపీఎల్ చరిత్రలో 10 ఆల్‌టైమ్ రికార్డులు ఇక్కడ అందిస్తున్నాం. వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ క్రిస్ గేల్ ఐపీఎల్‌లోనూ మ్యాజిక్ చేశాడు. టీ20 ఫార్మాట్ రారాజు, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ తను. ఐపీఎల్‌లో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగుల రికార్డు గేల్ పేరిట ఉంది.**

ఆ ఇన్నింగ్స్‌లో గేల్ ఏకంగా 17 సిక్సర్లు బాదాడు. పూణే వారియర్స్ పై ఆడిన ఈ ఇన్నింగ్స్‌లో పలు రికార్డులు నమోదయ్యాయి. ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. వేగవంతమైన సెంచరీ కూడా 'యూనివర్స్ బాస్' క్రిస్ గేల్ పేరిట ఉంది. క్రిస్ గేల్ 23 ఏప్రిల్ 2013న పూణే వారియర్స్ పై జరిగిన మ్యాచులో కేవలం 30 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో నేటికీ ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. గత సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ మెరుపు సెంచరీ బాదినప్పటికీ, అతను కూడా ఈ రికార్డును బద్దలుకొట్టలేదు. 35 బంతుల్లో సెంచరీ పూర్తి చేసి, ఐపీఎల్‌లో రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ ఐపీఎల్‌లో అతిపెద్ద భాగస్వామ్యం నెలకొల్పారు. 14 మే 2016న గుజరాత్ లయన్స్ పై 229 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో రికార్డులు తిరగరాశారు. కోహ్లీ, డివిలియర్స్ ఇద్దరూ సెంచరీలు చేశారు. ఆ మ్యాచ్‌లో డివిలియర్స్ 52 బంతుల్లో 129 పరుగులు, కోహ్లీ 55 బంతుల్లో 109 పరుగులతో చెలరేగారు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ రికార్డు రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్ యశస్వి జైస్వాల్ పేరిట ఉంది. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ 11 మే 2023న కోల్‌కతా నైట్ రైడర్స్ పై కేవలం 13 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. విరాట్ కోహ్లీ పేరిట చెక్కుచెదరని ఈ రికార్డును అధిగమించడం దాదాపు చాలా కష్టం. కోహ్లీ 2016 సీజన్‌లో 973 పరుగులు చేశాడు. 2016 ఎడిషన్‌లో అద్భుత ఫాంలో ఉన్న కోహ్లీ 4 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలు చేశాడు. తరువాత గిల్ 2023లో 890 పరుగులు చేసి ఈ రికార్డును బద్దలు కొట్టేంత దగ్గరకు వచ్చాడు. ఐపీఎల్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక




పరుగులు చేసిన రికార్డు రవీంద్ర జడేజా, క్రిస్ గేల్ పేరిట ఉంది. గేల్ ఆర్‌సిబి తరపున ఆడుతూ 2011లో కొచ్చి టస్కర్స్ బౌలర్ పరమేశ్వరన్ ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. 2021లో సిఎస్‌కె తరపున ఆడుతూ జడేజా ఆర్సీబీపై హర్షల్ పటేల్ ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ బౌలింగ్ స్పెల్ వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ అల్జారీ జోసెఫ్ పేరిట ఉంది. తన అరంగేట్రం మ్యాచ్‌లోనే ఈ ఘనత సాధించాడు. 6 ఏప్రిల్ 2019న జరిగిన అరంగేట్ర మ్యాచ్‌లో అల్జారీ జోసెఫ్ 3.4 ఓవర్లలో కేవలం 12 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ 2014, 2015 సీజన్ల మధ్య వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచింది. కేకేఆర్ తప్ప మరే ఇతర జట్టు ఇప్పటి వరకు వరుసగా ఇన్ని మ్యాచ్‌లలో విజయం సాధించలేదు. 2014లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలిచింది. ఒక సీజన్‌లో అత్యధిక క్యాచ్‌లు (వికెట్ కీపర్లను మినహాయించి) పట్టిన రికార్డు ఆర్సీబీ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ పేరిట ఉంది. ఆర్‌సిబి తరపున ఆడుతూ 2016లో డివిలియర్స్ మొత్తం 19 క్యాచ్‌లు అందుకున్నాడు.




# ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ గ్రీన్ సిగ్నల్

గత ఏడాదిన్నర కాలంగా భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి 'క్రికెట్ దౌత్యాన్ని' ఆయుధంగా ఎంచుకుంది. ఇందులో భాగంగానే ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రసారాలపై ఉన్న అడ్డంకులను తొలగించింది. ఈ నిర్ణయం ద్వారా ఇరు దేశాల మధ్య మళ్లీ క్రికెట్ సంబంధాలు బలపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బంగ్లాదేశ్ నూతన సమాచార, ప్రసార శాఖ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వపన్ శనివారం ఈ కీలక ప్రకటన చేశారు. ఐపీఎల్ ప్రసారాలను తాము అడ్డుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా ఛానల్ లేదా బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయాలనుకుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. క్రీడలను, రాజకీయాన్ని వేర్వేరుగా చూడాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ తమ దేశంలో మ్యాచ్‌లను చూపిస్తే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాల మేరకు విడుదల చేయడంతో పెద్ద దుమారం రేగింది. అప్పట్లో అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం దీనిని తీవ్రంగా పరిగణించి భారత్‌కు వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగానే ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేయడంతో పాటు, భారత్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో కూడా బంగ్లాదేశ్ జట్టు పాల్గొనకుండా అడ్డుకుంది. దీనివల్ల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భారీగా నష్టపోయింది. బంగ్లాదేశ్ ప్రభుత్వ తాజా నిర్ణయంతో అక్కడ ఉన్న లక్షలాది మంది ఐపీఎల్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 19వ సీజన్ ప్రారంభం రోజే ఈ అనుమతి రావడం విశేషం. ఇది కేవలం ప్రసారాలకే పరిమితం కాకుండా, వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్లలో బంగ్లాదేశ్ ఆటగాళ్లు మళ్లీ ఐపీఎల్ జట్లలో చేరడానికి మార్గం సుగమం చేస్తుందని క్రీడా పండితులు అంచనా వేస్తున్నారు. భారత్-బంగ్లాదేశ్ మధ్య మళ్లీ క్రికెట్ సిరీస్‌లు జరిగేలా కొత్త ప్రభుత్వం పావులు కదుపుతోంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA

# అనిరుధ్ -కావ్య మారన్ పెళ్లి?

## కోలీవుడ్ మీడియాలో సెన్సేషనల్ న్యూస్..

సౌత్ సినీ ఇండస్ట్రీలో ఒకరు మ్యూజిక్ సెన్సేషన్.. మరొకరు బిజినెస్ సామ్రాజ్యానికి వారసురాలు. ఇప్పుడు వీరిద్దరి చుట్టూ ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్యా మారన్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో హీట్ పుట్టిస్తోంది. గత కొద్ది రోజులుగా తమిళ మీడియాలో ఈ వార్త తెగ హల్‌చల్ చేస్తోంది. అనిరుధ్, కావ్యా మారన్ మధ్య సాన్నిహిత్యం ఎప్పటి నుంచో ఉంది. అనిరుధ్ తన కెరీర్‌లో అత్యధిక విజయవంతమైన చిత్రాలను సన్ పిక్చర్స్ బ్యానర్‌లోనే అందించారు. రజనీకాంత్ జైలర్ నుంచి విజయ్ లియో వరకు సన్ నెట్‌వర్క్ నిర్మించిన సినిమాలకు అనిరుధ్ అందించిన మ్యూజిక్ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ క్రమంలోనే కావ్యా మారన్ తో అనిరుధ్ కు పరిచయం ఏర్పడిందని, అది కాస్తా ప్రేమగా మారిందని టాక్. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోసం అనిరుధ్ ప్రత్యేకంగా సాంగ్ కంపోజ్ చేయడం కూడా ఈ రూమర్లకు మరింత బలాన్ని చేకూర్చింది. ఈ ఏడాది జూన్ నెలలో అనిరుధ్, కావ్యా మారన్ కలిసి విదేశాల్లో తిరుగుతున్నట్లు కొన్ని ఫోటోలు రెడిట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో కనిపించాయి. వీరు కలిసి లాస్ వెగాస్ వీధుల్లో షికారు చేశారని, కొన్ని ఖరీదైన రెస్టారెంట్లలో డిన్నర్ డేట్‌లకు వెళ్లారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఈ ఫోటోలు బయటకు వచ్చినప్పటి నుండి వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారనే వార్తలకు రెక్కలు వచ్చాయి. తాజాగా వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయని, త్వరలోనే నిశ్చితార్థం ఉండబోతోందని కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇటీవల ఒక సినిమా వేడుకలో అనిరుధ్ పాల్గొన్నప్పుడు మీడియా ప్రతినిధులు ఆయన పెళ్లి గురించి ప్రశ్నించారు. "అనిరుధ్ గారు, మీ పెళ్లి శుభలేఖ ఎప్పుడు ఇస్తున్నారు?" అని అడగ్గా.. అనిరుధ్ ఒక్క క్షణం ఆగి, నవ్వుతూనే చిన్నపాటి అసహనంతో మళ్లీ ఇదేనా? అని బదులిచ్చి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆయన ఈ వార్తలను పూర్తిగా ఖండించకపోవడం, కేవలం దాటవేయడం చూస్తుంటే ఏదో ఉందనే అనుమానాలు ఫ్యాన్స్ లో బలపడుతున్నాయి. మరోవైపు అనిరుధ్ ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.25 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటూ కెరీర్ పీక్స్ లో ఉన్నారు. ఒకరు తన సంగీతంతో ప్రపంచాన్ని ఊపేస్తున్న ఆర్టిస్ట్.. మరొకరు పవర్‌ఫుల్ బిజినెస్ సామ్రాజ్యాన్ని నడిపిస్తున్న మహిళ. వీరిద్దరి కలయిక నిజంగానే జరిగితే అది ఈ దశాబ్దంలోనే అతిపెద్ద బిగ్ వెడ్డింగ్ అవుతుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం అనిరుధ్ వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉండగా, కావ్యా మారన్ ఐపీఎల్ 2026 సీజన్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. మరి ఈ జంట నిజంగానే పెళ్లి పీటల వరకు వెళ్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# అప్పుడు షారుక్.. ఇప్పుడు సల్మాన్?

సీనియర్ హీరోల పాలిటి కల్పతరువుగా మారింది లేడీ సూపర్‌స్టార్ నయనతార. మొన్న సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు'తో కలిసి సందడి చేసిన ఈ అందాలభామ, ప్రస్తుతం బాలకృష్ణ, మలినేని గోపీచంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమాలో బాలయ్యకు జోడీగా నటిస్తున్నది. త్వరలోనే ఈ సినిమా షూట్‌లో కూడా జాయిన్ కానుంది. ఇదిలావుంటే.. తాజాగా ఈ అగ్రతార మరో ప్రస్టేజియస్ మూవీకి కూడా సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సల్మాన్‌ఖాన్ హీరోగా పైడిపల్లి వంశీ దర్శకత్వంలో టాలీవుడ్ నిర్మాత దిల్‌రాజు నిర్మించనున్న బాలీవుడ్ సినిమాలో నయనతార కథానాయికగా ఎంపికైందట. ఇప్పటికే షారుక్‌ఖాన్‌కు జోడీగా 'జవాన్' చిత్రంలో నటించి, బాలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్నది నయనతార. ఇప్పుడామె సల్మాన్‌తో జతకట్టనుండటం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం సల్మాన్ 'మాతృభూమి' అనే సినిమా చేస్తున్నారు. అది పూర్తయిన వెంటనే వంశీ పైడిపల్లి ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.

# ఇది నటన కాదు.. నా రెండేళ్ల కష్టం

పాత్ర కోసం సర్వశక్తులూ ఒడ్డి శారీరకభాషను మార్చుకోవడం నేటి కథానాయకులకు పరిపాటైంది. 'బైకర్' సినిమాలో 18ఏండ్ల వయసున్న రేసర్‌గా శర్వానంద్ కొన్ని నిమిషాలు కనిపించాలి. దానికోసం తన శరీరాన్ని పూర్తిగా మార్చుకున్నారు శర్వానంద్. 'ఉదయం సూర్యోదయానికి ముందే నిద్ర లేవడం, లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన వ్యాయామాలతో శరీరకంగానే కాదు, మనసికంగా కూడా బలంగా మారాను' అని శర్వానంద్ అన్నారు. ఈ ప్రయాణంలో విజయం సాధించేందుకు యోగా తనకు ఉపయోగపడిందని, దీంతో బరువు తగ్గి మరింత షార్ప్‌గా తయారయ్యానని శర్వా చెప్పారు. 'బలమైన నిర్ణయం



ముందు, నిరాశ, నిస్పృహలు నిలువలేవన్న నిజం ఈ రెండేళ్ల ప్రయాణంలో నాకు అర్థమైంది. ఇది నటన కాదు.. నా రెండేళ్ల కష్టం. మారాలనే పట్టుదల ఫలితాన్ని రేపు తెరపై చూస్తారు' అని నమ్మకంగా చెప్పారు శర్వానంద్. ఏప్రిల్ 3న 'బైకర్' విడుదల కానున్న విషయం తెలిసిందే.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఫైళ్లు ఇక ఆన్‌లైనే.. నిర్లక్ష్యం చేస్తే కుదరదు

**ఏప్రిల్ 1 నుండి ఈ - ఆఫీస్ తప్పనిసరి**

**కలెక్టర్ చంద్రశేఖర్‌**

**జూన్ వరకు అత్యంత కీలకం.. అధికారులు విధుల్లోనే ఉండాలి**

**ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభల నిర్వహణకు సర్వం సిద్ధం**

**గ్రామసభల్లో లబ్ధిదారుల చిట్టా చదవాల్సిందే**

**ధాన్యం కొనుగోలుపై ఫోకస్**

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై కలెక్టర్ ఆదేశాలు**

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

ఏప్రిల్ ఒకటి నుండి ఈ - ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్లను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ - ఆఫీస్ ద్వారా ఫైళ్ళ నిర్వహణ విషయమై ఇదివరకే జిల్లా అధికారులు, వారి సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. అందువల్ల జిల్లా అధికారులందరూ ఈ - ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ళ నిర్వహణకు సంసిద్ధం కావాలని ఆయన కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా ఏప్రిల్ 2 న గ్రామసభలు నిర్వహించాలని, అలాగే మున్సిపాలిటీలలో మున్సిపల్ వార్డు సభలు నిర్వహించాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనల ప్రకారం గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని చెప్పారు. ఇదివరకు ఆదేశించినట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధి దారుల వివరాలను గ్రామసభలలో చదివి వినిపించాలని, గ్రామసభల్లో ప్రజలకు అర్థమయ్యే విధంగా ఫోటోలు, వీడియోలతో ప్రజెంటేషన్ ఇవ్వాలని, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమావేశాల మినిట్స్‌ను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు.ప్రజా



పాలన పరిధిలోకి రాని పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను ఉదాహరణకు వివిధ సంక్షేమ శాఖల ద్వారా విద్యార్థులు పొందిన ఉపకార వేతనాల లబ్ధి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి, 6 గ్యారంటీ ల ద్వారా పొందిన లబ్ధి అలాగే ధరణి కింద తిరుమలగిరి సాగర్ మండలాన్ని, భూభారతి



కింద దేవరకొండ మండలంలో తీసుకున్న పైలెట్ ప్రాజెక్టును, కనగల్ మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద సోలార్ రూఫ్ టాప్ ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల



వివరాలను సైతం ప్రజలకు తెలియజేయాలని, అందువల్ల గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా వారీగా రూపొందించి వెంటనే సిపిఓ కు సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఈ - వేస్ట్ నిర్వహణ వివరాలు ఇవ్వాలన్నారు. పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి పెండెన్సీ ని తగ్గించాలన్నారు. రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభమైన దృష్ట్యా రానున్న రెండున్నర నెలలు అత్యంత కీలకమని, అలాగే జూన్ వరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక, జనగణన, ధాన్యం కొనుగోలు, వంటి ముఖ్యమైన పథకాలను అమలు చేయాల్సి ఉందని, జిల్లా అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, అత్యవసరమైతే తప్ప, ఎవరికి సెలవులు ఉండవని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలాలలో టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులు ఎట్టి పరిస్థితులలో ఖాళీగా ఉండరాదని, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో తప్పనిసరిగా చేరేలా



చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆడపిల్లలు చదువు మధ్యలో నిలిపి పెళ్లిళ్ల వైపు వెళ్లకుండా ప్రోత్సహించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు సమయంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖలు ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని , అన్ని శాఖలలో పెండింగ్లో ఉన్న ఫైల్స్ వెంటనే క్లియర్ చేయాలని అన్నారు. అనంతరం మార్కెటింగ్ శాఖ ద్వారా 2025 -2026 రబీ ధాన్యం కొనుగోలుపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లా ముస్లిం ఉద్యోగుల టేబుల్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. 27 వ జాతీయ సీనియర్ చెవిటి క్రీడల ఛాంపియన్షిప్ పోటీలలో మెడల్స్ పొందిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. కాగా సోమవారం నాటి ప్రజావాణికి మొత్తం 126 ఫిర్యాదులు రాగా,రెవెన్యూ శాఖకు 69, ఇతర శాఖలకు 57 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, చండూర్ ఆర్డీఓ శ్రీదేవి, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు హాజరయ్యారు.

## ఆర్టిజన్ల గర్జన

**నల్గొండ డివిజన్ కార్యాలయం ముందు భారీ ధర్నా**

**బ్రిటిష్ కాలం నాటి నిబంధనలు తొలగించాలని డిమాండ్**

**మద్దతు తెలిపిన పలు సంఘాలు**



అక్షరకలం నల్గొండ

తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఎఈ జేఏసీ ) పిలుపులో భాగంగా నల్గొండ డివిజన్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నా కార్యక్రమం హోరెత్తింది. ఏప్రిల్ 8వ తేదీ నుండి చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త సమ్మెకు సన్నాహకంగా సోమవారం జరిగిన ఈ నిరసన ప్రదర్శనకు వివిధ కార్మిక సంఘాలు భారీగా మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా టీవీఎఈ జేఏసీ చైర్మన్ జిట్టబోయిన లింగస్వామి యాదవ్, కన్వీనర్ మద్ది శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. మార్చి 26న జరిగిన ధర్నా కంటే ఈరోజు జరిగిన కార్యక్రమానికి కార్మికులు రెట్టింపు సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయడం వారి ఆవేదనకు, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆర్టిజన్లకు బ్రిటిష్ కాలం నాటి స్టాండింగ్ రూల్స్‌ను వర్తింపజేయడం అన్యాయమని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత కాలపు నిబంధనల స్థానంలో పాత ఏపీ ఎస్ఈబి రూల్స్‌నే అమలు చేయాలని వారు కోరారు. ప్రస్తుతం ఆర్టిజన్లుగా పరిగణించబడని ఇతర కార్మికులను కూడా వెంటనే ఆర్టిజన్లుగా గుర్తించి న్యాయం చేయాలన్నారు. ఆర్టిజన్ల పోరాటానికి సంఘీభావం తెలపడానికి 327 యూనియన్ ఎస్పిడిసిఎల్ నల్గొండ డివిజన్ కార్యదర్శి పాండన్న, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ చిట్యాల రాజు హాజరయ్యారు. వారికి ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు, ప్రభుత్వం దిగివచ్చే వరకు మా పోరాటం ఆగదు. ఏప్రిల్ 8 నుండి జరగబోయే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ భారీ ధర్నా కార్యక్రమంలో టీవీఎఈ జేఏసీ ఉమ్మడి జిల్లా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, విశ్వం, సహదేవ్, వేణుగోపాల్ రెడ్డి, బిక్షమయ్య, విజయ్, రాజు, యాదగిరి, ఉమాదేవి, శైలజ, లింగారెడ్డి, సైదులు, నాగమణి తదితర ఆర్టిజన్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాటిచ్చారు.. మంచినీటి కష్టాలు తీర్చారు

**ఎన్నికల హామీని మూడు నెలల్లోనే నెరవేర్చిన**

**కొండమల్లేపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి**



అక్షరకలం దేవరకొండ

రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, గెలిచాక మరచిపోవడం సాధారణం. కానీ, కొండమల్లేపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి మాత్రం తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ఆదర్శంగా నిలిచారు. మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డు, సినిమా థియేటర్ పక్కన ఉన్న గంటలోల్ల బజారు వాసుల దశాబ్దాల తాగునీటి సమస్యకు ఆయన శాశ్వత పరిష్కారం చూపారు. గత ఎన్నికల ప్రచార సమయంలో గంటలోల్ల బజారు నివాసితులు తమ నీటి కష్టాలను అభ్యర్థి యుగంధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆయన స్పందిస్తూ.. "నేను గెలిచినా, ఓడినా మీకు మాట ఇస్తున్నాను.. గెలిచిన మూడు నెలల్లోనే ఇక్కడ బోరు వేయిస్తాను" అని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే గెలిచిన మూడు నెలల లోపే సొంత చొరవతో బోరు బావిని తవ్వించి, నీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ.. "గతంలో ఎందరో నాయకులు వచ్చారు, వేస్తాం చూస్తాం అని వెళ్లారే తప్ప మా సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. కానీ యుగంధర్ రెడ్డి గారు ఇచ్చిన మాట ప్రకారం మా దాహార్తిని తీర్చారు. ఆయనకు మేము ఎల్లవేళలా రుణపడి ఉంటాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యుగంధర్ రెడ్డితో పాటు ఉప సర్పంచ్ పద్మా వెంకటయ్య, బిజిలి లింగం, గంట మల్లేష్, శ్రీను, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనుల పట్ల సర్పంచ్ చూపుతున్న చిత్తశుద్ధిని గ్రామస్తులు వేనోళ్ల కొనియాడుతున్నారు.

## నేడు దేవరకొండలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

**---సంతానం లేని దంపతులకు లక్ష్మీ విజయ హాస్పిటల్ లో ప్రత్యేక అవకాశం**

అక్షరకలం దేవరకొండ

సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు భరోసా కల్పించేందుకు పట్టణంలోని లక్ష్మీ విజయ స్పెషాలిటీ హాస్పిటల్, ఓ వి ఏ ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నేడు ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. గాంధీ నగర్ లోని హాస్పిటల్ ప్రాంగణంలో ఈ శిబిరం ఉదయం నుండే ప్రారంభం కానుంది.ఐయుఐ,స్కానింగ్ మరియు సెమెన్ అనాలిసిస్ (ఎస్ ఏ ) పరీక్షలపై సగం ధరకే అవకాశం. అత్యాధునిక ఐ వి ఎఫ్ చికిత్సపై 15 శాతం డిస్కౌంట్. ఆర్థిక ఇబ్బందుల వల్ల చికిత్సకు దూరంగా ఉన్న దంపతులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ యాజమాన్యం కోరింది. వివరాలకు 9666558104, 9666558105 నంబర్లను సంప్రదించవచ్చు.

## మారుమూల పల్లెలో మద్యం పై మహిళల శంఖారావం

**గ్రామాల్లో మద్యం అమ్మితే 20 వేలు, తాగితే 10 వేల పెనాల్టీ వేయాలని తీర్మాణం**

**గ్రామాల్లో బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్**



అక్షరకలం యాదాద్రి భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా శివారులో గల గుండాల మండలం వెల్మజాల గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేయాలని, మద్య నిషేధాన్ని అమలు చేయాలని, మద్యం తాగితే ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా నష్టపోతారని మహిళలు ప్రచారం నిర్వహించారు. సోమవారం గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు మద్యం వద్దు - ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కురిమిల కవిత, బొల్లేపల్లి రేణుక, కొడారి మమత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

యాదాద్రి భువనగిరి

అక్షరకలం



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 30 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణి లో రెవిన్యూ శాఖ- 25, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, హౌసింగ్ 2, మున్సిపాలిటీ ఒక్కటి చొప్పున వచ్చాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణం పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నర్రి లింగస్వామి ఆరోతేజ

అక్షరకలం చౌటుప్పల్





యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడెం ఎన్ఆర్ఈజీఎస్ నిధులలో భాగంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మంజూరు చేసిన పది లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం కొనసాగుతోంది. ఈ సిసి రోడ్ల నిర్మాణాన్ని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆరో తేజ్ పర్యవేక్షిస్తున్నారు.ఈ పనులలో భాగంగా రాజన్న నగర్‌లోని బీఆర్ఎస్ నాయకులు,మాజీ ఉపసర్పంచ్ గంట పరమేష్ యాదవ్ ఇంటి నుండి బద్దుల ముత్యాలు ఇంటి వరకు నిర్మిస్తున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పందుల మహేష్,కొంపల్లి నాగరాజు,బద్దుల రాజు,రెండవ వార్డ్ సభ్యుడు పచ్చిపాల ఐలయ్య, మాజీ వార్డ్ సభ్యురాలు సిర్రాగోని లింగమ్మ, గంట రమేష్, గంట మల్లేశం, గంట రాజు, గ్రామస్తులు, తదితరులు,పాల్గొన్నారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

## టీఎస్ జీ వో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చేపూరి నర్సింహా చారి



**అక్షరకలం నల్గొండ**

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చేపూరి నర్సింహా చారి రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సంఘం ఎన్నికలు ఆదివారం హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, జిల్లా అధ్యక్షుడు నాగిళ్ళ మురళి, జిల్లా కార్యదర్శి జె. శేఖర్ రెడ్డి, జిల్లా కార్య వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## యువత స్వయం శక్తితో ఎదగాలి

**-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**అక్షరకలం దేవరకొండ**

యువత స్వయం శక్తితో ఎదగాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం కొండమల్లెపల్లి పట్టణంలో నూతనంగా శ్రీ హనుమాన్ మెడికల్ ఏజెన్సీ నీ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....... నాణ్యమైన మందులు అందించాలని ఆయన కోరారు. -యువత అన్ని రంగాలలో రాణించాలి ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు అధ్యక్షులు కేసానీ లింగా రెడ్డి, మారం రవీందర్ రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షులు,చెన్నారం సర్పంచ్ రమావత్ తులసిరామ్, రావుల వెంకటయ్య, నేనావత్ శంకర్,సురేష్, తదితరులు ఉన్నారు.

## అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు: బిఆర్ఎస్వీ నేత బొడ్డుపల్లి కృష్ణ



**అక్షరకలం దేవరకొండ**

అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల గొంతు నొక్కలేరని బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. సోమవారం నిరుద్యోగుల 'అసెంబ్లీ ముట్టడి' సందర్భంగా ఆయనను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నిరుద్యోగులను నమ్మించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వారి నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు. వయోపరిమితిని 46 నుండి 34 ఏళ్లకు తగ్గించి నిరుద్యోగుల భవిష్యత్తుతో రేవంత్ సర్కార్ ఆటలాడుతోందని మండిపడ్డారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, నిరుద్యోగ భృతి ఊసే లేదని ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్ లేకపోవడం విచారకరమని, ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## సమస్యలనుత్వరగాపరిష్కరించాలి.. . ఐటిడిఎ.పిఓ.బి.రాహుల్ ,

**అక్షర కలం / భద్రాచలం**

వివిధ ఆదివాసి గిరిజన గ్రామాలనుండి ఆదివాసి గిరిజన కుటుంబాలు ఎంతో నమ్మకముతో



తమసమస్యలనువిన్నవించుకోవడానికి గిరిజన దర్బార్లో దరఖాస్తులు చేసుకుంటారని,ఆదివాసి గిరిజన కుటుంబాలకు సంబంధిత యూనిట్ అధికారులు వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు.సోమవారం నాడు ఐటీడీఏ సమావేశమందిరంలోఏర్పాటుచేసిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించి సంబంధిత యూనిట్ అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ట్రైకార్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కొరకు, కొత్తగా ఏర్పాటు చేసే మత్స్యకార సొసైటీల అనుమతి కొరకు, వ్యవసాయానికి సంబంధించి కరెంటు,బోరు,మోటారుకొరకు,జీవనోపాధిపెంపొందించుకోవడానికి వ్యక్తిగత రుణాలు ఇప్పించుట కొరకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి పొందుటకు శిక్షణలు ఇప్పించుట కొరకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎం పోస్టులు ఇప్పించుట కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు,మరియు ఇప్పించుట కొరకు, గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు.

# గ్యాస్ కష్టాలపై "కమర్షియల" పోరు

**దేవరకొండలో హోటళ్ల స్వచ్ఛంద బంద్**

**ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ...**

**బస్టాండ్ వద్ద ధర్నా**

**డొమెస్టిక్ సిలిండర్లకు అనుమతివ్వాలి.. లేదంటే మినహాయింపునివ్వాలి**

**సివిల్ సప్లై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్**

**అక్షరకలం దేవరకొండ**




గ్యాస్ సిలిండర్ల కొరత, సివిల్ సప్లై అధికారుల దాడులకు నిరసనగా దేవరకొండ పట్టణంలోని టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, టీ స్టాల్స్ మరియు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు సోమవారం స్వచ్ఛంద బంద్ పాటించాయి. తినుబండారాల యజమానులందరూ ఏకమై తమ నిరసనను గళమెత్తారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు మాట్లాడుతూ.. చిరు వ్యాపారాలు చేసుకునే తమకు కమర్షియల్ సిలిండర్ల ధరలు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక డొమెస్టిక్ సిలిండర్లు వాడుతుంటే, సివిల్ సప్లై అధికారులు దాడులు చేస్తూ సిలిండర్లను సీజ్ చేస్తున్నారని మండిపడ్డారు. వ్యాపారాలు సాగక, అధికారుల వేధింపులు తట్టుకోలేక మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది అని వారు వాపోయారు.

### ప్రధాన డిమాండ్లు..

తమకు తక్షణమే తక్కువ ధరలో డొమెస్టిక్ సిలిండర్లను అందుబాటులోకి తేవాలి. డొమెస్టిక్ సిలిండర్లు అందుబాటులో లేనప్పుడు, కమర్షియల్ వాడకంపై ఉన్న నిబంధనల నుండి తమకు మినహాయింపునివ్వాలి. సివిల్ సప్లై అధికారులు తమపై చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలి. ర్యాలీ అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులను కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఫిన్ సెంటర్లు, భోజన హోటల్స్, టీ స్టాల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మిర్చి బండ్లు, రెస్టారెంట్ల యజమానులు వందలాదిగా పాల్గొన్నారు.

## అక్షర ఉత్సవం.. చెరుకుపల్లిలో మార్మోగిన "బడిబాట" నినాదం

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం**

**సర్పంచ్ మీసాల రామచంద్రయ్య**

**అక్షరకలం దేవరకొండ**




ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా, విద్యా కుసుమాలు వికసించాలనే సంకల్పంతో గుండ్లపల్లి మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో 'బడిబాట' కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం ఉదయం స్థానిక జెడ్పీహెచ్ఎస్ , ఎంపీపీఎస్ పాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ గ్రామ వీధుల్లో పండుగ వాతావరణాన్ని తలపించింది. గ్రామ సర్పంచ్ మీసాల రామచంద్రయ్య, గెజిటెడ్ హెచ్ఎం ఇస్లావత్ గోప్య నాయక్ ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులు. ఏ ఒక్క బిడ్డ కూడా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ ముందస్తు బడిబాట నిర్వహిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు ఎండను సైతం లెక్కచేయకుండా ప్రతి ఇంటినీ సందర్శించి, ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మారుతున్న విద్యా ప్రమాణాలను హెచ్ఎంలు గోప్య నాయక్, ముడి శ్రీనయ్య వివరించారు:కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా డిజిటల్ తరగతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మూడు జతల యూనిఫాంలు, షూస్, సాక్స్ మరియు బ్యాగుల పంపిణీ. నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు 'రాగిజావ' అందిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆంగ్ల మాధ్యమ బోధన ప్రవేశపెట్టినట్లు స్పష్టం చేశారు. విద్యావేత్త జంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మనుగడ గ్రామ అభివృద్ధికి చిహ్నం. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిట్టెమ్మ, వార్డు సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

# హామీలు ఏమయ్యాయి.? ఆశా వర్కర్ల నిప్పులు

**దేవరకొండలో ఆశా వర్కర్ల భారీ ధర్నా**

**18,000 కనీస వేతనం ఇవ్వాల్సిందేనని డిమాండ్**

**అక్రమ అరెస్టులు, పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం**

**అక్షరకలం దేవరకొండ**



రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా దేవరకొండలో ఆశా వర్కర్లు గర్జించారు. సోమవారం దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో వందలాది మంది ఆశా వర్కర్లు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ నల్లా వెంకటయ్య, ఆశా వర్కర్ల సంఘం నేత విమల మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి వెళ్తున్న వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ధ్వజమెత్తారు. సుమారు 10 పోలీస్ స్టేషన్లలో వర్కర్లను నిర్బంధించి, లాఠీఛార్జ్ చేయడం ప్రభుత్వ నిర్బంధ పాలనకు నిదర్శనమని వారు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆశా వర్కర్లకు రూ. 18,000 కనీస వేతనం, ఫిక్స్‌డ్ సాలరీ వెంటనే అమలు చేయాలి. గత 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను, ఇన్సెంటివ్‌లను వడ్డీతో సహా చెల్లించాలి. ఆన్‌లైన్ పనులు, ఏఎన్సి (ఏ ఎన్ సి ) రిజిస్ట్రేషన్లు, స్పుటం సేకరణ వంటి వాటిలో అసాధ్యమైన టార్గెట్లు పెట్టి వేధించడం ఆపాలి. ఆన్‌లైన్ రిపోర్టింగ్ కోసం నాణ్యమైన స్మార్ట్ ఫోన్లు అందించాలి. విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే పూర్తిస్థాయి బీమా సౌకర్యం కల్పించాలి.

### కరోనా యోధులను కించపరచొద్దు..

కరోనా వంటి విపత్కర కాలంలో ప్రాణాలకు తెగించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం కోసం అహర్నిశలు శ్రమించిన ఆశా వర్కర్లను నేడు ప్రభుత్వం విస్మరించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో గర్భిణీలకు, బాలింతలకు సేవలందిస్తున్న తమకు కనీసం ఇల్లు గడిచేంత జీతం కూడా రాకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో తదుపరి కార్యాచరణగా కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరించి సమ్మెకు వెనుకాడబోమని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డివిజన్ పరిధిలోని ఆశా వర్కర్లు, సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వేతనాలు ఇవ్వరు.. టార్గెట్లు పెంచుతారా? (కోరెక్క అనసూయ )



మేము గర్భిణీలకు, బాలింతలకు అర్ధరాత్రి కూడా సేవలు అందిస్తున్నాం. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పని చేశాం. కానీ నేడు మాకు కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన రూ. 18,000 వేతనాన్ని తక్షణమే అమలు చేయాలి. స్మార్ట్ ఫోన్ల పేరుతో మాపై ఆన్‌లైన్ పని భారం పెంచడం సరికాదు. మా సమస్యలను విన్నవించుకోవడానికి హైదరాబాద్ వెళ్తుంటే పోలీసులు మమ్మల్ని అడ్డుకుని, అరెస్టులు చేయడం ఏంటి? మా డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదు.

### అక్రమ అరెస్టులు ఆపాలి.. ( నల్లా వెంకటయ్య, జిల్లా జాయింట్ సెక్రెటరీ)



ప్రభుత్వం ఆశా వర్కర్ల పట్ల అనుసరిస్తున్న మొండి వైఖరిని సిఐటియు తీవ్రంగా ఖండిస్తోంది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, 10 పోలీస్ స్టేషన్లలో వర్కర్లను నిర్బంధించడం దుర్మార్గం. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు. ఏఎన్సి రిజిస్ట్రేషన్లు, స్పుటం టార్గెట్లు అంటూ వర్కర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించి, రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి. లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడితో పాటు రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిస్తాం.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# బాలికల భద్రతకు భారీ అడుగు

## ఉప్పల్ పీహెచ్‌సీలో హెచ్‌పీవీ టీకా ప్రారంభం

### సర్వైకల్ క్యాన్సర్ నివారణకు కీలక కార్యక్రమం

### తల్లిదండ్రులు తప్పక వినియోగించుకోవాలి -- డాక్టర్ సౌశీల్య రాణి





**ఉప్పల్, మార్చి 30 (అక్షర కలం):**

బాలికల ఆరోగ్య రక్షణలో భాగంగా అత్యంత కీలకమైన హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్య రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌశీల్య రాణి మాట్లాడుతూ, సర్వైకల్ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధిని ముందుగానే నివారించేందుకు ఈ టీకా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. 2011 జనవరి 1 నుండి 2012 మార్చి 6 మధ్య జన్మించిన బాలికలకు ఈ టీకాను అందజేస్తామని చెప్పారు. మంగళవారం నుండి ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉప్పల్ పీహెచ్‌సీలో టీకా కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. హెచ్‌పీవీ టీకా సర్వైకల్ క్యాన్సర్ నివారణలో 93 నుంచి 100 శాతం వరకు ప్రభావవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుమార్తెలకు టీకా వేయించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా మరింత మంది బాలికలు ఈ టీకా పొందేలా కృషి చేయాలని సూచించారు.

## వెల్లోడి మహిళా సమాజ్ భవన ఆక్రమణను అడ్డుకోవాలి--కలెక్టర్‌కు వినతి



**అక్షరకలం నల్గొండ**

నల్గొండ పట్టణంలోని చారిత్రాత్మక వెల్లోడి మహిళా సమాజ్ భవనాన్ని (లేడీస్ క్లబ్) మున్సిపల్ అధికారులు ఆక్రమించడాన్ని నిరసిస్తూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లేడీస్ క్లబ్ కార్యవర్గ ఉపాధ్యక్షులు చంద్రావతి, కార్యదర్శి శారద, కోశాధికారి రాధా మాట్లాడుతూ.. గత 60 ఏళ్లుగా ఈ భవనం ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ వంటి స్వయం ఉపాధి పథకాలను ఇక్కడి నుంచే అందించినట్లు తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరడంతో కార్యకలాపాలు తాత్కాలికంగా ఆగిపోయాయని, ఇదే అదనుగా మున్సిపల్ అధికారులు భవనాన్ని ఆక్రమించి పేరు మార్పిడి చేశారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విన్నవించామని, భవన పునర్నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా సిఫారసు చేస్తానని ఆయన హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. అయితే, మున్సిపల్ అధికారులు మాత్రం మొండిగా వ్యవహరిస్తూ అక్కడ కబోర్డులు ఏర్పాటు చేశారని మండిపడ్డారు. మున్సిపల్ యంత్రాంగం వెంటనే స్పందించి ఆక్రమణలను (కబోర్డులను) తొలగించాలని, లేనిపక్షంలో పట్టణంలోని మహిళలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు సింగం లక్ష్మి, ఇంద్ర, పుష్ప, సరళ, విజయలక్ష్మి, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 30:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు పట్టణానికి చెందిన దాసరి ప్రవీణ్ కుమార్, దాసరి రమేష్ లు తమ తాతల నుండి వస్తున్న పట్టా భూమిని నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, ఈ పొరపాటును సవరించి తమకు పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. కిష్టంపేట గ్రామస్తులు తమ దరఖాస్తులో నిజామాబాద్ నుండి జగదల్ పూర్ జాతీయ రహదారి 63 లోని కిష్టంపేట, భీమారం మధ్యలో ఉన్న జోడు వాగులపై నూతన వంతెన నిర్మించాలని కోరారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ తనకు గిఫ్ట్ దస్తావేజు, న్యాయస్థానం డిక్రీ ద్వారా సంక్రమించిన భూమి పట్టాను కొందరు అక్రమంగా రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం అశోక్ రోడ్డు కు చెందిన పాలకుర్తి రమాదేవి తన భర్త పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట విరాసత్ చేసి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వేమనపల్లి మండలం నాగారం గ్రామ మాజీ సర్పంచ్ తలండి స్వరూపారాణి తాను అధికారంలో ఉన్నప్పుడు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన భీమనపల్లి రామచంద్రం తనకు చెన్నూరు మండలం బాబురావుపేట గ్రామ శివారులో గల భూమి ఆన్ లైన్ భూభారతి నందు అసైన్డ్ భూమిగా చూపుతోందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులు నిర్బంధాలు ఉద్యమాలను ఆపలేవు..పిడిగం నాగయ్య ముదిరాజ్




**తిరుమలగిరి సాగర్ (అక్షర కలం )**

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో మలిదశ ఉద్యమకారుడు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పిడిగం నాగయ్య ముదిరాజ్ మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు స్వామినాయక్ శంకర్ నాయక్ పోలేపల్లి అంజి లను తిరుమలగిరి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు ఈ సందర్భంగా మలిదశఉద్యమ కారుడు పార్టీ అధ్యక్షులు పిడిగం నాగయ్య ముదిరాజ్ అరెస్ట్ లు నిర్భంధాలతో ఉద్యమాలను అణచలేరని ప్రభుత్వం మలి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, మీరు ఉద్యమలను అణిచి వేయాలని నియంత గా వ్యవరిస్తే చరిత్రలో జరిగిన సంఘటన లు తిరిగేసి చూడు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడతాది అనే విషయం మర్చిపోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సపవత్ శంకర్ నాయక్ స్వామి నాయక్ పోలపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి మండల సర్పంచ్ల ఫోరం గౌరవ అధ్యక్షునిగా కుంచాల శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడిగా బికోజి



**తుంగతుర్తి మార్చ్ 30 (అక్షర కలం)**

తుంగతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాడు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుల కమిటీ ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా కుంచాల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడుగా సభావాత్ బికోజి, ఉపాధ్యక్షుడిగా కలకోట్ల మల్లేష్, కార్యదర్శిగా మలేపాక సాయిబాబా, ప్రధాన కార్యదర్శిగా మొర సంధ్య బిక్షం, కోశాధికారిగా రమేష్ ను ఎనుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షులు బికోజి మాట్లాడుతూ... సర్పంచుల సమస్యల కోసం కృషి చేస్తానని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ల ఫోరం అధ్యక్షులను ఎంపీడీవో,వివిధ గ్రామాల సర్పంచులు వారిని శాల్వాతో ఘనంగా సన్మానించి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గట్ల నరసింహారావు విజయం

**అక్షరకలం కోదాడ**



కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో గట్ల నరసింహారావు ఘన విజయం సాధించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 105 ఓట్లు పోలవ్వగా, నరసింహారావుకు 63 ఓట్లు ఆయన ప్రత్యర్థి ఉయ్యాల నరసయ్యకు 41 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లకుండా పోగా, 22 ఓట్ల మెజారిటీతో నరసింహారావు విజేతగా నిలిచినట్లు ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారి రామకృష్ణారావులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శరత్ బాబు, సిలివేరు వెంకటేశ్వర్లు,రవి,నవీన్, శ్రీధర్, రహీం, ధనలక్ష్మి, దుర్గా, హేమలత, రంజాన్ పాష,రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తడకమల్ల గ్రామ శాఖ కార్యవర్గం ఏకగ్రం ఎన్నిక

### అధ్యక్షులుగా పంగ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా గాదె బాబు

**మిర్యాలగూడ మార్చి30 అక్షర కల**

మిర్యాలగూడ మండల పరిధిలోని తడకమళ్ళ గ్రామం లో గత మూడు సంవత్సరాల నుండి అంబేద్కర్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహి స్తున్నారు ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం ముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంగం అధ్యక్షుల్ని ఎన్నుకోవడం ఆనవాయితీ అలాగే ఈ సంవత్సరం కూడా నూతన అధ్యక్షుని 29/03/2026 నాడున అంబేద్కర్ కమిటీ ఏకగ్రీవంతో అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరిగింది. అంబేద్కర్ యువజన సంఘం తడక మల్ల గ్రామ శాఖ అధ్యక్షులుగా.పంగ యాదగిరి ఉపాధ్యక్షులు బొజ్జ వెంకటేష్. ఉపాధ్యక్షులు.గాదె శంకర్ ప్రధాన కార్యదర్శి గాదె బాబు కోశాధికారి. జిల్లా సైదులు ఈ యొక్క కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది వీరికి సలహాదారులుగా గాదె సాయి జిల్లా శ్రీను కుల పెద్ద మనుషులు అంబేద్కర్ యూత్ ప్రతి ఒక్కరు పాల్గొనడం జరిగింది



## చిట్యాల కనకదుర్గ ఆలయంలో హుండీ లెక్కింపు

**అక్షర కలం : చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల పట్టణంలోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గత ఏడాది మార్చి 29వ తేదీ నుండి ఇప్పటి వరకు భక్తులు తమ మొక్కుల రూపంలో సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 1,53,510 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి వెల్లడించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు సమక్షంలో, ఎండోమెంట్ జిల్లా అధికారి చింతల పూర్ణచంద్రారెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. భక్తులు సమర్పించిన నగదును అధికారుల సమక్షంలో క్షుణ్ణంగా లెక్కించి ఆలయ రికార్డుల్లో నమోదు చేశారు. ఈ లెక్కింపు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీత రమేష్, వైస్ చైర్ పర్సన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు, కౌన్సిలర్లు కోనేటి ఎల్లయ్య, బొబ్బల సందీప రామ్ రెడ్డి, దేశపాక లత రాజేష్, కుక్కల మోహన్, నాగిళ్ళ సుధాకర్, గాలి యాదమ్మ లింగయ్య, ఏర్పుల పరమేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్టా సాయిలు, అర్చకులు గోవింద్ మిశ్రా, జిపిఓ ముజీఫ్ రహమాన్, మహిళా పోలీస్ కానిస్టేబుల్ పి రమాదేవి, భక్తులు రేగొండ వేణుమాధవ్, దోర్నాల మంజుల, చందా నాగలక్ష్మి, స్వప్న, మిట్టపల్లి జ్యోతి, పుష్ప, రజిత, సునీత, దీపారాణి, గురిజ పద్మ, అక్షిత తదితరులు పాల్గొన్నారు.



# వేసవి కాలంలో పరిశ్రమలలో అగ్ని ప్రమాదల నివారణకు చర్యలు చేపట్టాలి....

- ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక....
- జిల్లాలో పటిష్టంగా అమలు కావాలి.....
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్......



**మెదక్ /కొల్చారం మార్చి30(అక్షర కలం):-**

వేసవికాలం పరిశ్రమలలో అగ్ని ప్రమాదం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు ను పరిశ్రమల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల అనుమతులను నిర్నీత గడువు లోగా మంజూరు చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది. జిల్లాస్థాయి రాయితీలను మంజూరు చేయడం జరిగింది. వేసవి కాలంలో పరిశ్రమలు ఎటువంటి అగ్నిప్రమాదాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకోవాలని కర్మాగార శాఖ అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో అమలు కావాలని మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కర్మగారా అధికారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదు - సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



**అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి మార్చి 30 :**

2025-26 రబీ కాలానికి సంబంధించిన వరి ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ హైమావతి రైస్ మిల్లర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ 2025-26 రబీకారానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 421 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాదాపు 5 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేయనున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ఏరోజుకారోజు వరిధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు రవాణా చేయడం జరుగుతుందని అన్నారు. 48 బాయిల్డ్ రైస్ మిల్లులు, 64 ఇతర రైస్ మిల్లులు జిల్లాలో గలవని, ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ప్రతిరోజు మిల్లులకు వచ్చే వరిధాన్యాన్ని రైస్ మిల్లర్లు దించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ గోపికృష్ణ, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి



**అక్షర కలం సిద్దిపేట మార్చి 30:**

అరైవ్ అలైవ్ రోడ్ భద్రత కార్యక్రమంలో భాగంగా ఈరోజు సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ ఆటో యూనియన్ లోని ఆటో డ్రైవర్ కి రోడ్ సేఫ్టీ మరియు ట్రాఫిక్ రూల్స్ గురించి ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ భాస్కర్ వివరించడం జరిగింది, ఆటో డ్రైవర్స్ ఆటో నడిపేటప్పుడు కచ్చితంగా యూనిఫామ్ ధరించాలని, ఆటో సామర్థ్యం మేరకే ప్రయాణికుల్ని ఎక్కించుకోవాలని, మద్యం సేవించి ఆటో నడపకూడదని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఆటో కి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలకు బారిన పడకుండా ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ అఖిల్, భాస్కర్, అబీబ్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కిట్టు, వైస్ ప్రెసిడెంట్ వైకుంఠం ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్, మేనేజర్ పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారంటూ ఆరోపణలు
- నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్ల కేటాయింపు

**మేడ్చల్, మార్చి 30 (అక్షరకలం):**

ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్, మేనేజర్ అబ్దుల్ సలాంలు విధులకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు ఓ స్థానికుడు ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎల్లంపేట మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ, అక్రమార్కులకు అండగా అధికారుల యంత్రాంగం నిలుస్తుందని వడ్ల నాగచారి ఫిర్యాదు చేశారు.. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడమే కాకుండా నిర్మాణం పూర్తయ్యాక వాటికి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలకు ఇంటి నెంబర్లు సైతం కేటాయిస్తున్నారని, అధికారులు ఇలా వ్యవహరించడం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేక చర్య అని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. అంతేకాకుండా కమిషనర్ అలాగే మేనేజర్ వారి విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ, విధులకు అలసంగా హాజరవుతున్నారని, అందువలన ప్రజలకు అందాల్సిన సేవలు ఆలస్యమవుతున్నాయని ఫిర్యాదులో పొందుపరిచారు. ఇదే విషయమై ఉన్నతాధికారులు కమిషనర్, మేనేజర్ పై సమగ్ర విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రజావాణికి 50 ఆర్జీలు

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రజావాణి దరఖాస్తలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి,పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఆర్జికి ప్రాధాన్యత నిచ్చి సంబంధిత శాఖల అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాలన్నారు. ప్రజావాణిలో





రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతి, వ్యవసాయ, మహిళా శిశు సంక్షేమం, బీసీ అభివృద్ధి శాఖలు, నీటి పారుదల, ట్రాన్స్పోర్ట్, అనిమల్ హస్బెండ్రి, మున్సిపాలిటీలు, ఉపాధి తదితర శాఖలకు సంబంధించి 50 ఆర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**





యాదాద్రి భువనగిరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. సోమవారం భువనగిరి పట్టణంలో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో, కెనరా బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రేనింగ్ ఇన్స్టిట్యూట్ (=ాజు×) శిక్షణ సంస్థను కిసాన్ నగర్‌లో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువత మరియు మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. =ాజు× ద్వారా అందిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. శిక్షణ అనంతరం స్వయం ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు బ్యాంకుల ద్వారా అవసరమైన సహకారం అందించబడుతుందని అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఫోటోగ్రఫీ ఢ వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోమ్ వైరింగ్, ప్లంబింగ్, టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ వంటి వివిధ కోర్సులు నిర్వహించబడు తున్నా యని అన్నారు. ఈ కార్యక్రమములో =ాజు× డైరెక్టర్ కిషన్ భుక్య , డివిసనల్ మేనేజర్ పంకజ్ , యల్.డి.యం మాటూరి వంశీ, డి.పి.యం శ్రీనివాస్, జే.డి.యం రాజు మరియు బ్యాంకు ప్రతినిధులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు..జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## నల్గొండ హైవేపై 'ట్రామా కేర్ సెంటర్' ఏర్పాటుకు కసరత్తు

## బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశం

**అక్షరకలం నల్గొండ**






రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు రహదారి భద్రత చర్యలను కట్టుదిట్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తో కలిసి ఆయన జిల్లా స్థాయి రహదారి భద్రత సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లాలో ఉన్న ఆయా రహదారులు, వాటిపై ఉన్న బ్లాక్స్ స్పాట్స్, ఇప్పటివరకు సంభవించిన రోడ్డు ప్రమాదాలు, సంభవించిన మరణాలు, తీసుకున్న చర్యలు, తదితర అంశాలను పోలీసు శాఖ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అనంతరం మాట్లాడుతూ రహదారి భద్రతపై సమాజంలోని అన్ని వర్గాల వారికి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం పై ఏప్రిల్ 2న నిర్వహించనున్న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక గ్రామ, మున్సిపల్ వార్డు సభల ద్వారా పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అంతేకాక లైసెన్స్ రిజిస్ట్రేషన్, లైసెన్సు సేవా పోర్టల్ పై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లాలో జాతీయ రహదారి నిడివి ఎక్కువగా ఉన్నందున, హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్ ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. హైవే పెట్రోలింగ్, హైవేపై ప్రమాదాలు జరిగిన వెంటనే 20 నిమిషాల లోపు పోలీసు లతోపాటు, సంబంధిత శాఖల అధికారులు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ,పోలీసులు గుర్తించిన రహదారుల బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు సంభవించకుండా గట్టి చర్యలు చేపట్టాలని, ఏప్రిల్ మొదటి వారంలోగా గుర్తించిన రహదారులపై బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ఇతర రహదారి అథారిటీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ శరథ్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీసు యంత్రాంగం తో పాటు, జిల్లా అధికార యంత్రం తీసుకున్న చర్యల వల్ల గడచిన 18 నెలల్లో ఆయా రహదారులపై బ్లాక్ స్పాట్ల సంఖ్య ను 58 నుండి 38 తగ్గించామని, అలాగే మరణాల సంఖ్య ఏడు శాతానికి తగ్గించగలిగామని తెలిపారు. ఇటీవల కాలంలో చాలామంది మైనర్ యువకులు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనివల్ల ప్రమాదాలు సంభవించేందుకు అవకాశం ఉందని ,అందువల్ల తల్లిదండ్రులు - టీచర్ల సమావేశంలో పాఠశాల విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ముకుందాపురం, మాడుగులపల్లి, నల్గొండ టౌన్, హాలియా, నకరేకల్, కొండభీమనపల్లి, దేవరకొండ, చింతపల్లి నుండి మాల్ తదితర రహదారులపై సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల నివారణకు కు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్ తో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాదాల నివారణకు కృషిచేసిన అధికారులు ఇతర అధికారులకు జిల్లా కలెక్టర్ ఎస్పీలు అభినందన పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, మున్సిపల్ కమిషనర్లు, ట్రాన్స్పోర్ట్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

# చిట్యాలలో వరుస మొబైల్ స్టోరీలు

## ప్రయాణకులే టార్గెట్ల చోరీలకు పాల్పడుతున్న ముఠా

**అక్షర కలం ; చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో గత వారం రోజులుగా వరుసగా జరుగుతున్న మొబైల్ ఫోన్ల దొంగతనాలు స్థానిక ప్రజలను ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఆసరాగా చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. ప్రయాణికులే లక్ష్యంగా మొబైల్ చోరీలకు పాల్పడుతున్నారు అని సమాచారం. ?స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. చిట్యాల బస్టాండ్ మరియు భువనగిరి రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఈ చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా బస్సు ఎక్కే సమయంలో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుంటున్న దొంగలు వారి జేబుల్లోని ఫోన్లను అత్యంత చాకచక్యంగా మాయం చేస్తున్నారు. చిట్యాలలో బస్టాండ్, భువనగిరి రోడ్డుబ్లో బస్సు ఎక్కే క్రమంలో తోపులాటను సృష్టించి ఫోన్లు దొంగతనం చేస్తున్నారు. ?వరుస దొంగతనాలతో విసిగిపోయిన బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు ఇప్పటికే పలువురు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. బహిరంగ ప్రదేశాల్లో భద్రతను పర్యవేక్షించాలని, సీసీ కెమెరాల ద్వారా దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రయాణికులు బస్టాండ్ వంటి రద్దీ ప్రాంతాల్లో తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



# హెచ్ పి వి వ్యాక్సిన్ వేయిద్దాం...

## గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ను నివారిద్దాం.....

## మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

**అక్షరకలం, చండూరు**

మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పివి వ్యాక్సిన్ పంపిణీ కేంద్రాన్ని సోమవారం చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రులలో వేల రూపాయల ఖర్చయ్యే ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, అర్హులైన బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ మాస రాజు మాట్లాడుతూ, 14 నుండి 15 ఏళ్ల వయస్సు గల బాలికలు తమ తల్లిదండ్రుల సమక్షంలో ఆధార్ కార్డు ఫోటోకాపీని సమర్పించి, అన్ని పనిదినాలలో టీకా తీసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యా బ్లెస్సి, సూపర్వైజర్ ఝాన్సీ, ఆరోగ్య సిబ్బంది రజిని, మెహబూబి, మంగమ్మ పాల్గొన్నారు.



# సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్ పూజల హరికృష్ణ మాకొద్దు

పూజల హరికృష్ణ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకం పై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు



**అక్షర కలం సిద్దిపేట మార్చి 30:**

నంగునూరు మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అన్యాయం జరిగిందని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా నంగునూరు మండల అధ్యక్షుడు తప్పెట శంకర్ గ్రామ శాఖ అధ్యక్షుడు అనరాజు నాగరాజు ఆధ్వర్యంలో సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజా హరికృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తూ, నాటి అధికార పార్టీ పెట్టిన కేసులకు భయపడకుండా పోరాటాలు చేసిన తమను పక్కనపెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పార్టీ కోసం పనిచేయని నాయకుల ఇంట్లో మూడు పదవులు, ప్రభుత్వం రాగానే పార్టీ మారిన వారికి డైరెక్టర్ల పదవులు ఇచ్చి మండల నాయకుల సలహాలు సూచనలు లేకుండానే తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇలాగా ఆయన వ్యవహార శైలి కొనసాగితే రాబోయే రోజుల్లో మండల కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టి పోతుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఒక్క రోజైనా మండలంలోని కార్యకర్తను ఓదార్చిన రోజులు లేవన్నారు. ఇలాంటి నాయకునికి పార్టీ టికెట్ ఇచ్చి అపహస్య పాలు చేస్తుందని అన్నారు. అధిష్టానం ఎప్పటికైనా నియోజకవర్గ ఇంచార్జ్ తొలగించి పార్టీకి న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అచ్చిన సత్తయ్య గౌరబోయిన సంపత్, చలికాని యాదగిరి, సందబోయిన తిరుపతి యాదవ్, విక్రం రెడ్డి, జంగిటి శ్రీనివాస్ రాగుల కనకయ్య,రాగుల కృష్ణ దేవులపల్లి ప్రసాద్, పంగశేఖర్, దేవులపల్లి శంకరయ్య, ఆరేపల్లి సురేష్ వాటి సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధన్నపేట గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ సొసైటి ఉపాధ్యక్షులు ఏడ్ల సోమిరెడ్డి



**అక్షర కలం సిద్దిపేట మార్చి 30**

నంగునూర్ మండలం సిద్దన్నపేట గ్రామానికి చెందిన డాకూరి రాజశేఖర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర ఆయిల్ పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఏడ్ల సోమిరెడ్డి,పి ఏ సి స్ చైర్మన్ కోల రమేష్ గౌడ్ అదే గ్రామానికి చెందిన బొల్లు తిరుపతి మరియు అనురాజుల పర్షరాములు వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతి, కత్తుల జనార్ధన్ రెడ్డి , మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కోటిరెడ్డి, తిరుమల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, రాజు, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 2500 ఆర్థిక సాయం ఎప్పుడు..బీఎస్పీ పార్టీ డిమాండ్

**అక్షర కలం సిద్దిపేట మార్చి 30:**



బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు కొండపలకల సంపత్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా బిఎస్పి రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలో కి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న దాని ఊసే లేకుండా పోయింది. మహిళలకు ఇస్తా అన్న 2500 రూపాయలు అందించాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుందని సందర్భంగా వారు తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చలని లేదంటే బీఎస్పీ పార్టీ దీని పైన పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ రోమాల బాబు, పట్టణ అధ్యక్షుడు గోపాల ప్రసాద్, ప్రసాద్ మౌర్య క బిఎస్పి నాయకులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడిలో భాగంగా ముందస్తు అరెస్టులు

**అక్షర కలం సిద్దిపేట మార్చి 30:**




గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి బయలుదేరిన నంగునూరు మండల సర్పంచ్ లను రాజగోపాల్ పేట్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్ తదితరులను పోలీసులు అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం మాట్లాడుతూ శాంతియుత నిరసనలను అడ్డుకోవడంపై సర్పంచ్ ల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయి బిల్లులు చెల్లించే వరకు ఈ ఉద్యమం ఆగదని హెచ్చరించారు.

# కాంగ్రెస్ పార్టీ లో కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులు

## సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ కి భారీగా పాలాభిషేకాలు

## కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు

## పార్టీ లైన్ దాటిన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవు

## -- కాంగ్రెస్ హెచ్చరిక

**అక్షర కలం సిద్దిపేట మార్చి 30:**



సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతున్న నేపథ్యంలో, పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ కృషితో నంగునూర్ మార్కెట్ కమిటీ లో పార్టీకి సేవలందించిన నాయకులకు పదవులు రావడం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా నంగునూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని పూజల హరికృష్ణ కి పాలాభిషేకాలు నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. హరికృష్ణ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతూ, సాధారణ కార్యకర్తలకు కూడా న్యాయం చేసే నాయకుడిగా ఎదిగారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నారు. అదేవిధంగా పార్టీకి వ్యతిరేకంగా పని చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. పార్టీ లైన్ దాటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీ లో స్థానం ఉండదని హెచ్చరించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసే వారికి మాత్రమే గౌరవం, గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కష్టపడే కార్యకర్తలకు సరైన సమయంలో సరైన అవకాశాలు కల్పించడంలో పూజల హరికృష్ణ ముందుంటారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే నాయకుడిగా ఆయన అందరి మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. హరికృష్ణ నాయకత్వంలో సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతోందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌ పూజల హరికృష్ణ కి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమము లో ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ , రాజగోపాల్ పేట్ సర్పంచ్ కృష్ణ,కాటం కనకయ్య,ఎండీ ఇమ్రాన్, రంగు అశోక్ గౌడ్, తిప్పని రాజేష్, జీవన్ నాయక్, శ్యామ్ రెడ్డి, రంగరెడ్డి, సురేందర్ రెడ్డి,సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 30:**




సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అరైవ్ అలైవ్ ఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా సోమవారం జైపూర్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో దుబ్బపల్లి ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డుభద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ప్రజా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సులు, కంటి వైద్య శిబిరాలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువకులు, కార్మికులు, విద్యార్థులు రోడ్డు భద్రతపై తెలుసుకున్న విషయాలను తమ గ్రామాలు, కాలనీలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, సహచరులకు తెలియజేసే దూతలుగా మారాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించేలా చైతన్యవంతం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరిస్తూ, వారి భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రాత్రి సమయంలో డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డుపై నడిచే వారిని గమనిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. కనీస జాగ్రత్తలు పాటిస్తే రోడ్డుప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారంతో రామగుండం కమిషనరేట్‌ను ప్రమాదరహిత ప్రాంతంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జైపూర్ సీఐ నవీన్, చెన్నూరం టౌన్ ఇన్స్పెక్టర్ బన్సీలాల్, చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, జైపూర్ ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మందమర్రి పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించిన బిఎస్పి




**మందమర్రి/ చెన్నూరు మార్చి 30 అక్షర కలం ప్రతినిధి:-**

పట్టణంలోని విద్యుత్ సమస్యలపై గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సమస్యలపై ప్రజావాణిలో మందమర్రి మండల ప్రత్యేక అధికారి ఎన్, రాజేశ్వర్ కి మండలంలోని గ్రామీణ, పట్టణ విద్యుత్ పలు సమస్యలపై సోమవారం వినతి పత్రం సమర్పించిన బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయంపై ప్రత్యేక అధికారి సానుకూలంగా స్పందించారు. సంబంధిత విద్యుత్ శాఖ ఇంజనీర్ కు జిల్లా కలెక్టర్ కి పిర్యాదు పంపించి సమస్య పరిష్కరిస్తానని ప్రత్యేక అధికారి తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, మందమర్రి మండల అధ్యక్షులు ఎస్.కె, రహీం బాబా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..... - మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్....

**మెదక్/ కొల్చారం మార్చి30(అక్షర కలం):-**



ప్రజావాణిలో సమస్య పరిష్కారానికి ప్రజలు అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి మొత్తం 81 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిష్కార స్వభావం దరఖాస్తు దారునికి తెలియచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని ఆయన సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డిఆర్ డి ఓ శ్రీనివాసరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి.... - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ....

**మెదక్/ కొల్చారం మార్చి 30(అక్షర కలం):-**



మెదక్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు 2-4-2026 ,గురువారం రోజున మెదక్ ప్రైవేట్ ఐటిఐ (విద్యుత్ సబ్స్టేషన్ ఎదురుగా) లో. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో హైదరాబాద్ నందు పనిచేయుటకు అర్హతలు ఉన్నవారు హాజరు కావాలన్నారు. 18 సంవత్సరాల వయసు నుండి 35 సంవత్సరాల వయసు గలవారు, బి ఫార్మసీ, డి ఫార్మసీ, ఏం ఫార్మసీ అర్హత, రూపాయలు 19,726 జీతంతో 25 ఫార్మసిస్ట్ ఉద్యోగాలు,18 సంవత్సరాల వయసు నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి ,డి ఫార్మసీ ,బి ఫార్మసీ ,ఏం ఫార్మసీ అర్హత, రూపాయలు 16,947 జీతంతో 20 ట్రైనీ ఫార్మసిస్ట్ ఉద్యోగాలు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి 10, ఇంటర్ ,డిగ్రీ అర్హత కలిగిన రూపాయలు 16,383 జీతం తో 25 ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాలు 18 నుంచి 208 సంవత్సరాల వయస్సు ఉండి బి బి ఏ , బి ఎస్ సి (కెమిస్ట్రీ, న్యూట్రీషియన్, ఫుడ్ సైన్స్) అర్హత కలిగి, రూపాయలు 18,640 జీతంతో 5 ప్రోడక్ట్ అడ్వైజర్ ఉద్యోగాలు 18 సంవత్సరాల వయసు నుండి 26 సంవత్సరాల మధ్య ఉండి, పదవ తరగతి ,ఇంటర్, డిగ్రీ రూపాయలు 12,500 జీతంతో 25 రిటైల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగాలు ఉన్నాయని అర్హత ,ఆసక్తిగల మెదక్ జిల్లాలో నిరుద్యోగ అభ్యర్థులు జాబ్ మేళాకు పూర్తి సమాచారంతో , అనుభవం ఉన్నవారు, ఫ్రెషర్స్ పాల్గొనవచ్చని సోమవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8247656356 నంబర్ను సంప్రదించాలన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం

– పాల్గొన్న ఎస్ సూర్య మోహన్ రెడ్డి ;

– కాంగ్రెస్ పార్టీ -- పేద ప్రజల అభివృద్దే లక్ష్యం.





**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్,30)**

మరికల్ ;నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెంపర్ణిక రెడ్డి సహకారంతో మాజీ డిసిసిఅధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మరికల్ మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలో అరుణ- రామచంద్రయ్య ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి పాల్గొని దంపతులకు గౌరవప్రదంగా నూతన వస్త్రాలు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోర్ల తిరుపతమ్మ,కురుమన్న, ఉప సర్పంచ్ దండు రాజు , వార్డ్ మెంబర్స్ మరియు కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సన్న బియ్యం పథకానికి ఒక సంవత్సరం. పొదెం.వీరయ్య ,

**అక్షర కలం / భద్రాచలం**



తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రేషన్ కార్డు దారులకు ప్రతినెల అందిస్తున్న రేషన్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమై ఈరోజుతో విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకోవడం ఎంతోఆనందదాయకమనితెలిపారు. ఈసందర్భంగాగౌరవముఖ్యమంత్రివం ్యలు ఎనుముల రేవంత్ రెడ్డికి,ఉపముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు,కి అలాగే రాష్ట్ర మంత్రివర్గ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు గౌరవ తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పొదెం వీరయ్య , సన్న బియ్యం పథకం ప్రవేశపెట్టడం ద్వారా మధ్యవర్తుల (దళారుల) వ్యవస్థకు గట్టి చెక్ పెట్టడంతో పాటు, నిజమైన లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం అందుబాటులోకి రావడం రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ప్రతి లబ్ధిదారుడు ఈసన్నబియ్యాన్ని స్వీకరించి వండుకొనివినియోగిస్తున్న పరిస్థితి ప్రభుత్వ పథకం విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా,ఆహార భద్రత బలోపేతం కావడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఈ పథకంసమర్థవంతంగాఅమలవుతున్నందుకు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విజయవంతమైన ఒక సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి ముఖ్యమంత్రి వర్యులు ఉపముఖ్యమంత్రి వర్యులు మరియు రాష్ట్ర మంత్రివర్గంఅందరికీ పొదెం వీరయ్య అభినందనలు తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

**అక్షర కలం సిద్దిపేట మార్చి 30:**

నంగునూరు మండలంలోని సిద్దన్నపేట వ్యవసాయం మార్కెట్ కమిటీ ఏఎంసీ వైస్ చైర్మన్ గా సాదుల్లా పవన్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తన విద్యాభ్యాసం నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ ఎస్ సి చదివిన పవన్ కుమార్, బీటెక్, ఎల్.ఎల్.బి పూర్తి చేశారు. ప్రస్తుతం యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. పవన్ కుమార్ తండ్రి సాదుల ఆత్మ రాములు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రస్తుత న్యాయవాది ఆయన సిద్దిపేట జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహిస్తున్నారు. తన తల్లి సాదుల రాణి కాంగ్రెస్ పార్టీ నుంచి నంగునూరు సర్పంచిగా ఎన్నికై నంగునూరు గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ రైతు కుటుంబానికి చెందిన తన చిన్న వయసులోనే వ్యవసాయం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి దక్కడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులకు ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. తమపై నమ్మకంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి తనను ఎంపిక చేసిన సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, మంత్రులు దామోదర్ రాజనర్సింహా, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ ఇందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు.



# భద్రాద్రి జిల్లాలో రేడియాలజిస్ట్ సేవల్లో నూతన రికార్డ్

### అన్ని ఏజెన్సీ ఆసుపత్రుల్లో రేడియాలజిస్టులు -- టిఐఎఫ్ఎఫ్ఎ స్కాన్ సేవలు అందుబాటులో

### గిరిజన గర్భిణి మహిళలకు వరంగా మారనున్న స్కానింగ్ సేవలు

**అక్షర కలం / భద్రాచలం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ వైద్యరంగం మరో కీలకమైలురాయిని అధిగమించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ఏజెన్సీ ఆసుపత్రుల్లో రేడియాలజిస్టులనునియమించి,టిఐఎఫ్ఎఫ్ఎ స్కాన్ (ఖుతీస్త్రవ్వస ×ఖుస్త్రఅఅస్త్ర టశీతీ ఖీఘ్ఖుశ్రీ చాఅశీఘ్ఖుశ్రీఐవం ) వంటి అత్యాధునిక స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి భద్రాద్రి వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు నూతన రికార్డును నెలకొల్పాయి.దూర ప్రాంతాలు, గిరిజనప్రాంతాల్లోనాణ్యమైన మాతృశిశు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లా అధికారులు దశలవారీగా తీసుకున్న చర్యలు ఫలితాన్నిస్తున్నాయి.గతంలోనే అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో ప్రసూతి వైద్యులను నియమించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రసూతి సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఫలితంగాప్రతినెలడెలివరీలు,సిజేరియన్



శస్త్రచికిత్సలు,ట్యూబెక్టమీలు మరియు ఇతర మాతృసేవలు పెరిగాయి.ఈ క్రమంలో రేడియాలజీ సేవలను మరింత బలోపేతం చేస్తూ, భద్రాచలం, ఎల్లందు, పాల్వంచ, మణుగూరు ఆసుపత్రుల్లో ఇప్పటికే టిఐఎఫ్ఎఫ్ఎ. స్కాన్ సేవలు అందుబాటులోఉండగా,అశ్వారావుపేట మరియు చర్ల ప్రాంతాల్లో రేడియాలజిస్ట్‌ల కొరత ఒక ప్రధాన సవాలుగా నిలిచింది.గత కలెక్టర్ జితేష్ పాటిల్,మరియుడీసీహెచ్ఎస్ డా. రవి బాబు, ప్రయత్నాలతో టిఐఎఫ్ఎఫ్ఎ.స్కానింగ్ యంత్రాలు సమకూర్చబడగా,ప్రస్తుత జిల్లా కలెక్టర్ అంకిత్ చౌరవతో కొత్త రేడియాలజిస్ట్‌ను అశ్వారావుపేట, చర్ల ఆసుపత్రులకు నియమించి ఈ లోటును పూర్తిగా అధిగమించారు. సహజంగా గ్రామీణ,గిరిజన ప్రాంతాల్లో రేడియాలజిస్ట్‌లను నియమించడం అత్యంత క్లిష్టమైన పని అయినప్పటికీ,జిల్లా పరిపాలన పట్టుదల, సమన్వయంతో ఈ సవాల్‌ను విజయవంతంగా ఎదుర్కొని జిల్లాలోని ఆరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో రేడియాలజీసేవలనుఅందుబాటులోకి తీసుకురావడం విశేషం. ఇప్పటి వరకు అన్ని మాతృసేవలు అందుబాటులో ఉన్నప్పటికీ టిఐఎఫ్ఎఫ్ఎ. స్కాన్ లేకపోవడం ఒక లోటుగా ఉండగా,ఇప్పుడు ఈ సౌకర్యం అందుబాటులోకి రావడంతో గర్భిణీలు పూర్తి స్థాయి మాతృసేవలను తమ ప్రాంతాల్లోనే పొందగలుగుతున్నారు. గర్భంలోని శిశువు అవయవాల అభివృద్ధిని వివరంగా పరిశీలించి, పుట్టుకలో వచ్చే లోపాలను ముందుగానే గుర్తించేందుకు టిఐఎఫ్ఎఫ్ఎ.స్కాన్ ఎంతో ఉపయోగపడుతుంది.ఇది గర్భిణీకి సకాలంలో సరైన వైద్య నిర్ణయాలు తీసుకునేందుకు సహాయపడుతూ తల్లి-శిశువు భద్రతను మెరుగుపరుస్తుంది.అలాగే గర్భిణి స్త్రీలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రయాణ సమయాన్ని, ఖర్చులను తగ్గిస్తుంది. ప్రత్యేకంగా పేద మరియు గిరిజన గర్భిణీలకు ఈ సేవలు ఎంతో మేలు చేస్తాయని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని డి సి చ్ ఎస్ డాక్టర్ రవి బాబు తెలిపారు.

## ఎంపీ వద్దిరాజు రాజ్యసభలో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సాధారణ పరిపాలన (సీఏపీఎఫ్) బిల్లు-2026పై ప్రసంగం

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**




కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్) దేశ అంతర్గత భద్రతకు వెన్నుముక వంటివని సీఆర్పీఎఫ్,బీఎస్ఎఫ్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్,ఐటీబీపీ,ఏస్ఏస్బీ తదిరత బలగాలు దేశ సరిహద్దులను కాపాడటం, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనడం, చట్టవ్యవస్థను పరిరక్షించడం వంటి కీలక బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు."కేంద్ర సాయుధ పోలీస్ బలగాల సాధారణ పరిపాలన బిల్లు -2026పై"రాజ్యసభలో సోమవారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.అయితే, ఈ బలగాల పరిపాలనా వ్యవస్థ ఇప్పటివరకు విభిన్నంగా, సంక్లిష్టంగా, కొంతమేర పాత పద్ధతుల్లో కొనసాగుతున్నదని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు.ఆ బలగాలకు వేర్వేరు నియమాలు, నిబంధనలు ఉండటం వల్ల అయోమయం, ఆలస్యం, పనితీరు లోపాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తీసుకువచ్చిన బిల్లు చాలా ముఖ్యమైనది, కీలకమైనది ఎంపీ రవిచంద్ర చెప్పారు.నియామకాలు, సేవా నిబంధనలు, బదిలీలు, పదోన్నతులు, క్రమశిక్షణ వంటి విషయాలలో ఒకే విధమైన వ్యవస్థను తీసుకు వచ్చేందుకు ఈ బిల్లు ద్వారా వీలవుతుందని ఎంపీ వద్దిరాజు వివరించారు. బలగాలన్నింటిలో ఒకే విధమైన నియమాలు ఉండటం వల్ల సమన్వయం మరింత మెరుగుపడుతుందని ఆయన చెప్పారు.సిబ్బంది నిర్వహణలో స్పష్టత రావడమే కాక జవాన్లలో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.నిర్ణయాల ప్రక్రియ వేగవంతం అవుతుందని, పారదర్శకత, బాధ్యత మరింత బలపడుతుందని ఎంపీ రవిచంద్ర అన్నారు.అయితే, ఈ బిల్లును అమలు చేసే సమయంలో కొన్ని ముఖ్యమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా జవాన్ల సంక్షేమం,మానసిక ఆరోగ్యం, కుటుంబ సహాయం, పని-జీవిత సమతౌల్యం, సరైన సెలవుల విధానం, ఆధునిక శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.అలాగే, ఫిర్యాదులు స్వీకరించడం,వాటిని సకాలంలో పరిష్కరించే వ్యవస్థ బలంగా ఉండాలని, రాష్ట్రాలతో సమన్వయం ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఎంపీ వద్దిరాజు సూచించారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర అనుభవాన్ని ఉదాహరణగా చూపిస్తూ,తమ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో భద్రతా వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకున్న చర్యలను వివరించారు.అవసరమైన ఆధునిక వాహనాలు, ఆయుధాలు సమకూర్చడమే కాక సర్వైలెన్స్, ఇంటెలిజెన్స్ వ్యవస్థల ద్వారా నక్సలిజం వంటి సమస్యలను సమర్థవంతంగా నియంత్రించగలిగినట్లు ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఈ బిల్లు సరైన మార్పులతో అమలు చేసినట్టయితే దేశ భద్రతను మరింత బలపరుస్తుందని, జవాన్ల మనోబలాన్ని పెంచుతుందని ఆయన అన్నారు. "దేశాన్ని కాపాడే వారికి మనం కేవలం మాటలతో కాకుండా, సమర్థవంతమైన విధానాలతో మద్దతు ఇవ్వాలి"అని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

# ఒక మధ్య తరగతి అమ్మాయి ఆకాశమే హద్దుగా విజయం

### బెంగళూరు స్థాయిలో మెరిసిన ఖమ్మం ఆణిముత్యం అర్వపల్లి అఖిల నాగ రమ్య

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**





ఖమ్మంనగరంలో నివాసముంటున్న అర్వపల్లి నగేష్ తన మధ్యతరగతి కుటుంబం సమేతంగా నివాసం ఉంటూ, ఇద్దరు ఆడపిల్లలు అనే భావన లేకుండా చదివించడం జరిగింది. అదే పట్టుదల ఉంటే ఆకాశమే హద్దు అని, పేదరికం చదువుకు అడ్డుకాదని ఖమ్మం నగరానికి చెందిన అర్వపల్లి అఖిల నాగ రమ్య నిరూపించింది. అఖిల నాగ రమ్య జాతీయ స్థాయిలో నిర్వహించిన సి.ఎం.ఎ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, బెంగళూరు స్థాయిలో తన సత్తా చాటింది. తద్వారా తన తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలాన్ని అందించి, ఖమ్మం జిల్లా పేరు మారుమోగేలా చేసింది. అఖిల నాగ రమ్య నగరంలోని, మామిళ్ళగూడెంలో నివాసముంటున్న అర్వపల్లి నగేష్ – శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె, వీరిది ఒక మధ్య తరగతి కుటుంబం, ఉన్న దాంట్లోనే సర్దుకుంటూ, నగేష్ తన ఇద్దరు కుమార్తెలను, ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని, సంకల్పించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో అఖిల ను, మామిళ్ళగూడెం లోని,మౌంట్ ఫోర్ట్ స్కూల్‌లో చేర్పించారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన అఖిల, పదవ తరగతిలో 9.5 జి.పి.ఏ (సుమారు 960 పైగా మార్కులు) సాధించి, పాఠశాల టాపర్‌గా నిలిచింది. అనంతరం సాహితి జూనియర్ కాలేజీ లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అఖిల, ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 9.5 జి.పి.ఏ తో అగ్రస్థానంలో నిలిచింది. చదువుపై ఆమెకున్న అంకితభావాన్ని గుర్తించిన తల్లిదండ్రులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఆమెను గుంటూరులోని ప్రముఖ 'మాస్టర్ మైండ్' కాలేజీలో సి.ఎం.ఎ కోర్సులో చేర్పించారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి, బెంగుళూరు లో జరిగిన గౌరవప్రదమైన వేదికపై ప్రశంసలు అందుకుంది. తల్లిదండ్రుల కష్టం నా విజయ రహస్యం, అంటూ, ఈ సందర్భంగా అఖిల నాగ రమ్య ఉద్వేగంతో మాట్లాడుతూ, తన విజయానికి ప్రధాన కారణం తన తల్లిదండ్రుల నిరంతర శ్రమ అని, పేర్కొన్నారు. మా నాన్న పడే కష్టం, మా అమ్మ ఇచ్చే ప్రోత్సాహం నన్ను,ఈ స్థాయికి చేర్చాయి. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి, నేను ఈరోజు బెంగుళూరు స్థాయిలో గుర్తింపు పొందడం కేవలం నా తల్లిదండ్రుల త్యాగమే. వారికి నా విజయం అంకితం అని ఆనంద బాష్పాలతో తెలియజేసింది. సమాజానికి స్ఫూర్తి.బెంగుళూరు స్థాయిలో ప్రతిభ చాటడం ద్వారా అఖిల నాగ రమ్య ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. సంకల్పం ఉంటే ఎంతటి కష్టాన్నైనా అధిగమించి ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఆమె నిరూపించింది. అఖిల సాధించిన ఈ ఘనత పట్ల, తన చెల్లెలు అయిన యువ నాగ శ్రీ కూడా, గుంటూరు లో చార్టెడ్ అకౌంట్ కోర్సులో విద్యను అభ్యసించడం,అక్క బాటలోనే చెల్లె కూడా అంటూ, స్థానికులు, ఉపాధ్యాయులు, ఆమె బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ, శు భాకాంక్షలు తెలిపారు.

# డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## స్టేట్ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సైదులు. మరికల్ సిఐ భగవంత్ రెడ్డి ;

అక్షర కలం/

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేకంగా మరికల్ టౌన్, కన్మనూర్ గ్రామం, తీలేరు గ్రామాల్లో ప్రజలకు, విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ నిర్వహించి, డ్రగ్స్ కి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ సైదులు, మరికల్ సీఐ భగవంత్ రెడ్డి, మరికల్ ఎస్సై రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ, సైదులు, సీఐ భగవంత్ రెడ్డి లు మాట్లాడుతూ.... యువత భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు





యువత జీవితాలను నాశనం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఎవరైనా డ్రగ్స్ వినియోగం లేదా అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద చర్యలు గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామాగ్రీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేకంగా తమ మద్దతును తెలిపారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించండి" అనే నినాదంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి: వైరా ఏసీపీ





అక్షర కలం/ వైరా:

ప్రజల సహకారం రోడ్డు భద్రతలో కీలకమని వైరా ఏసీపీసారంగపాణి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" ప్రత్యేక కార్యక్రమం ద్వారా"సురక్షితంగా గమ్యం చేరడం" "ప్రాణాలతో ఉండటం" అనే లక్ష్యంతో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై బోనకల్ పోలీస్ స్టేషన్ లో సర్పంచులు, వైస్ సర్పంచులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. అదేవిదంగా మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు తీసుకునే జాగ్రత్తలు సురక్షితమైన గమ్యానికి రక్ష అని అన్నారు. కార్యక్రమంలో మధిర రూరల్ సిఐ మధు, ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.


# నేలకొండపల్లి బౌద్ధ స్తూపం అభివృద్ధికి కేంద్రం దృష్టి సారించాలి

## జాతీయ బౌద్ధ పర్యాటక సర్క్యూట్ లో ఈ ప్రాంతాన్ని చేర్చాలి

## లోక్‌సభలో 377 నిబంధన ద్వారా

## ప్రస్తావించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని అభివృద్ధి చేసి, జాతీయ బౌద్ధ పర్యాటక సర్క్యూట్ లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి. సోమవారం లోక్‌సభలో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఈ ప్రాచీన వారసత్వ కట్టడాన్ని సంరక్షించేందుకు తక్షణ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు.

### చారిత్రక ప్రాముఖ్యత ఉన్న స్తూపం

నేలకొండపల్లి బౌద్ధ స్తూపం దక్షిణ భారతదేశంలో ముఖ్యమైన బౌద్ధ వారసత్వ క్షేత్రంగా నిలిచింది. శాతవాహన, ఇక్ష్వాకు రాజవంశాల కాలంలో (క్రీ.శ. 3-4 శతాబ్దాలు) ఇది వికాసం సాధించినట్లు పురావస్తు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. తవ్వకాలలో మహాస్తూపాలు, విహారాలు, ఇటుక నిర్మాణాలు, బుద్ధ విగ్రహాలు, రోమన్-భారతీయ నాణేలు వెలుగులోకి రావడం దీని ప్రాధాన్యతను మరింత స్పష్టంచేస్తోంది.

### సదుపాయాల కల్పన అవసరం

ఇంత ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ఈ స్థలం ఇప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతోందని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రహదారులు, సూచిక బోర్డులు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలు లేవని, సంరక్షణ లోపంతో నిర్మాణాలు దెబ్బతింటున్నాయని కూడా సూచించారు.

### జాతీయ బౌద్ధ పర్యాటక వలయంలో నేలకొండపల్లిని చేర్చాలి

పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమగ్ర సంరక్షణ చేపట్టాలని, స్థలంలో మ్యూజియం మరియు ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే జాతీయ బౌద్ధ పర్యాటక వలయంలో నేలకొండపల్లిని చేర్చితే దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ వారసత్వ కట్టడాన్ని పరిరక్షిస్తూ, తెలంగాణలో సాంస్కృతిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

# ధన్వాడ లో కర్రెమ్మ దేవాలయానికి రూ పది లక్షలు మంజూరు ;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్,30)




ధన్వాడ; ధన్వాడ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న కర్రెమ్మ దేవాలయం అభివృద్ధి కోసం నారాయణపేట ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేశారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు వ్యక్తి గత సహాయకుడు చిట్టెం మాధవరెడ్డి, సర్పంచ్ పి.జోతి రామచంద్రయ్య,ఉప సర్పంచ్ పూజారి నర్సింహులు,కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు, తదితరులు, పాల్గొన్నారు.

# వేసవి పశుగ్రాసం కొరతకు పరిష్కారం:

## - సబ్సిడీ గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి ;

## - మరికల్ మండల పశు వైద్య అధికారి డాక్టర్ మహదేవ్ ;




(అక్షర కలం,నారాయణపేట, జిల్లా రిపోర్టర్ ,మార్చి 30:)

వేసవికాలంలో పశువులకు పచ్చి గడ్డి అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పాడి రైతులకు 75% సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తోంది. ఈ విత్తనాలు చల్లిన తర్వాత 3-4 సార్లు కోసే అవకాశం ఉంది, కాబట్టి పాల శాతం పెరుగుతుందని,మరికల్ పశు సంవర్ధక అధికారి డాక్టర్ మహదేవ్,విఏఒ కె.నర్సింలు తెలిపారు. స్థానిక మరికల్ మండల పశు వైద్య శాఖ కార్యాలయంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సోమవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.రైతులు త్వరగా వెళ్లి విత్తనాలు పొందవచ్చు.

# మరికల్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం:

## - ఎమ్మెల్యే చిట్టెంపర్ణిక రెడ్డి సహకారంతో

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చ్,30)



నారాయణపేట జిల్లా, మరికల్ మండల కేంద్రంలోని 1వ వార్డులో నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డా. చిట్టెంపర్ణిక రెడ్డి , సహకారంతో, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గుప చెన్నయ్య మరియు 1వ వార్డు సభ్యులు పెంటమీది రాజేశ్వరి రఘు చేతుల మీదుగా జంగిడి పుష్పమ్మ-శంకరప్ప దంపతుల ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెలగొంది వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీష్ కుమార్, వార్డు సభ్యులు వసంత, చంద్రకళ, పోలేమోని అశోక్, బొందలకుంట రాజు, మరియు కాంగ్రెస్ నాయకులు పెంటమీది రాఘవేందర్ ,జంగిడి రవి, రామకృష్ణారెడ్డి, గౌడప్పోల రఘు, జంగిడి శ్రీనివాసులు, బాల్ రెడ్డి, తిరుమలయ్యలు మరియు కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

## -లేబర్ కోడ్ల రద్దుకై ఏప్రిల్ ఒకటిన బ్లాక్ డే

## -అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

అర్బన కలం/ ఖమ్మం అర్బన్:

ఖమ్మం అర్బన్ : రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల -నాయకులు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటిన దేశవ్యాప్త బ్లాక్డే నిర్వహించనున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్లోని ఏఐటియుసి కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన అఖిలపక్ష కార్మిక సంఘల సంయుక్త - సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గత 100 ఏళ్ళుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకు వచ్చిందన్నారు. కార్మిక చట్టాలలో అతి ముఖ్యమైన




పారిశ్రామిక వివాదాల చట్టం, ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1926, పారిశ్రామిక ఉపాధి (స్టాండ్ ఆర్డర్స్) చట్టం, 1946 పారిశ్రామిక వివాదాల చట్టం 1947 తదితర చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో తీసుకువచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ 2022లో అన్ని అంశాలు ఉన్నట్లుగానే కనిపిస్తాయని కానీ అవి ఆచరణకు సాధ్యం కావని వారు తెలిపారు. మోడీ ప్రభుత్వం భవిష్యత్తులో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా కాలపరిమితితో కూడిన ఉద్యోగాలను - సృష్టిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నివీర్, అగ్నిపద్ లాంటి పథకాలతో ఈ విధానాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పారిశ్రామికవేత్తల ఆదేశాల మేరకు 12 గంటల పనివిధానాన్ని ప్రవేశపెట్టి బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటకలో ఆమోదింపజేశారని వారు విమర్శించారు. దీని ఫలితంగానే కర్నాటక ప్రజలు ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మోడీ కార్మిక వ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు భారతదేశ వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటిన బ్లాక్ ను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో నిరసన బ్లాక్డేను - నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. విష్ణువర్ధన్, ఐఎన్టియుసి టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల రామకృష్ణ, ఉపాధ్యక్షులు సిద్దెల నగేష్, టియుసిఐ రాష్ట్ర నాయకులు సివై పుల్లయ్య, కె. శ్రీనివాస్, ఐఎఫయు జిల్లా - అధ్యక్షులు సుబాని, జిల్లా నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు .. ఏటి ఆంజనేయులు

## సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షులు

అక్షర కలం సిద్దిపేట మార్చి 30

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం లోని పాలమాకుల గ్రామంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు సమాచారం నిర్ణీత గడువులో ఇవ్వకుండా ఖచ్చితమైన సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులను చట్ట పరిధిలో శిక్షించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలిగించిన సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన ఆ అధికారుల భారతం పట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమాచార హక్కు చట్టం అనేది సామాన్య ప్రజలకు గొప్ప వజ్రాయుధంగా అభివర్ణించారు. చాలా కార్యాలయాల్లో ఇప్పటివరకు సమాచార హక్కు చట్టం సమాచార అధికారికి సంబంధించిన బోర్డులు ఇంకా పెట్టలేదని అలాంటి కార్యాలయాల పైన తప్పకుండా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడానికి పూనుకుంటుందని అన్నారు. జిల్లా కమిటీ నాయకులకు కార్యకర్తలకు సమాచార హక్కు చట్టం పైన పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశానుసారం నంగునూరు మండల ఇన్చార్జిగా కస్తూరి పల్లి రమేష్ ని ప్రధాన కార్యదర్శిగా తత్తరి రాజు ని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆసర్ల ప్రశాంత్ మరియు మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955